ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 9 మార్చి 2024 | 5






రాజమహేంద్రవరంలో కిక్కిరిసిన పుష్కరఘాట్

శివయ్యా..కాపాడయ్యా : కొవ్వూరులో భక్తాభిషేకం

20న చంద్రబాబు ప్రజాగళం

కొవ్వూరు, అనపర్తి నియోజకవర్గాల్లో బహిరంగ సభలు



రాజమహేంద్రవరం,మార్చి8(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌కు గ్యారంటీ, పిలుస్తోంది రా కదలిరా.. ఉమ్మడి సభలతో పార్టీ శ్రేణులు, ప్రజల్లో ఓ ఉత్సాహాన్ని , వచ్చే ఎన్నికల్లో గెలుపు ధీమాను కలిగించిన టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ప్రజల్లో ప్రజాగళం పేరిట ఈ నెల 11 నుంచి పర్యటిం చనున్నారు.ఇప్పటికే 94 మంది తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించిన చంద్రబాబు, త్వరలో రెండో జాబితా, లేదా తుది జాబితా ప్రకటించడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో బీజేపీ పెద్దలతో చంద్రబాబు,పవన్ భేటీ అయ్యారు. పొత్తు కొలిక్కిరావడం, సీట్ల కేటాయింపుపై స్పష్టత రావడం తెలిసిందే. రేపోమాపో వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.ఈ పర్యటన ముగిసిన వెంటనే ప్రజాగళం పేరిట ప్రజ ల్లోకి రానున్నారు.ఈ నెల 11న ఒంగోలు పార్లమెంట్ పరిధి ఎర్రగొండపా లెంలో బహిరంగ సభలో పాల్గొని అక్కడ నుంచి వరుసగా పర్యటిస్తారు. ఈనెల 17న ఏలూరు జిల్లాలోని దెందులూరు సభలో పాల్గొని, ఆదేరోజు సాయంత్రం కైకలూరు సభలో పాల్గొన్నారు.18న తుణుకులోనూ, ఉండి లోనూ బహిరంగ సభలు ఉంటాయి. 19న అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధి పి.గన్నవరం, రామచంద్రపురంలోనూ సభలు ఉంటాయి. 20న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు,అనపర్తిలో బహిరంగ సభల్లో పాల్గొంటారు.21న కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడులోనూ పెద్దాపురం బహిరంగ సభల్లో పాల్గొంటారు.22 నుంచి అనకాపల్లిలో ప్రవేశించి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సభలు నిర్వహిస్తారు. 25వ తేదీ వరకూ ప్రజాగళం సభల్లో పాల్గొంటారు.

హర హర మహాదేవ

- శివనామస్మరణతో మార్మోగిన గోదారి
- రాజమహేంద్రవరానికే లక్ష మంది భక్తులు రాక
- కిక్కిరిసిన గోదావరి ఘాట్‌లు.. ఆలయాలు
- దారి పొడవునా దాతల విందు.. పసందు

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, మార్చి 8 : గోదారంతా జనం..జనం.. అడుగుతీసి అడుగేయలేనంతా భక్తజనంతో గోదారంతా కిక్కిరిసింది.. హరహర మహాదేవ శంభో శంకర..హరోం హర.. ఓం నమఃశివాయ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. మహా శివరాత్రి పర్వదినం శుక్రవారం రాజమహేంద్రవరం, కొవ్వూరుకు భక్తజనంతో పోటెత్తారు. ఎక్కడెక్కడి నుంచో తరలి వచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. రాజమహేంద్రవరలో దక్షిణాకాశిగా ప్రసిద్ధిగాంచిన కోటిలింగాల క్షేత్రం, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్‌కు, గౌతమిఘాట్, సరస్వతి ఘాట్, కొవ్వూరులోని గోష్పాదక్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు చేరుకున్నారు.పవిత్రగోదావరిలో పుణ్య స్నానాలు చేశారు. కోటిలింగాల క్షేత్రంలోని ఉమాకోటిలింగేశ్వరాలయం, పుష్కరాలరేవులో వీరభద్రస్వామి, గోదావరి బండ్ రోడ్డులో మార్కండేయేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, సర్వేశ్వరాలయం, అన్నపూర్ణసమేత విశ్వేశ్వరాలయం (జోడిగుళ్ళు), ఉజ్జయిని మహంకాళేశ్వరాలయం , క్వారీప్రాంతంలోని కల్యాణి సమేత సోమలింగేశ్వరాలయం, సారంగధరేశ్వరాలయం, జాంపేట ఉమారామలింగేశ్వర ఆలయాలు భక్తజనంతో కిక్కిరిశాయి. కొవ్వూరు గోష్పద క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేకువజాము నుంచి క్షేత్రానికి చేరుకుని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు చేశారు. క్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలపై శివలింగాలకు గోదావరి జలాలతో అభిషేకాలు చేశారు.తెల్లవారుజామున 2 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు భక్తజనంతో గోదావరి తీర ప్రాంతమంతా కిక్కిరిసింది. సుమారు లక్ష మందికి పైగానే భక్తులు గోదావరి స్నానాలు చేసినట్టు అంచనా వేస్తున్నారు. వేలాది వాహనాలు రావడంతో గోదావరి రేవులకు అనుసంధానంగా ఉన్న రహదారులు అన్ని రద్దీగా మారిపోయాయి. కంబాలచెరువు-సీతంపేట- పేపరుమిల్లు రోడ్డు, కంబాలచెరువు-దేవిచౌక్- గోకవరంబస్టాండ్ రోడ్డు, కంబాలచెరువు- కృష్ణానగర్-ఆర్యాపురం రోడ్డు , కోటిపల్లిబస్టాండ్ గోదావరి బండ్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చాలా రద్దీగా మారి వాహనాలు జామ్ అయ్యాయి. మధ్యాహ్నం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.



ఎస్పీ జగదీశ్ పరిశీలన

ఔరా అనిపించిన దాతృత్వం

శివరాత్రి సందర్భంగా రాజమహేంద్రవరంలో వందలాదిగా దాతలు ముందు కొచ్చారు. దారిపొడవునా భక్తులకు పంచుతూనే ఉన్నారు. ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజనం, మజ్జిగ, ఐస్‌క్రీమ్,పుచ్చకాయ ముక్కలు, బాదం పాలు, రోజ్‌మిల్క్, పులిహోర తదితర రకాల ప్రసా దాలు ఇలా ఒక్కటేమిటి ఎన్నో రకాలు భక్తులు పంచారు. ఎవరికి తోచిన రీతిన వారు భక్తులకు తమ వంతు దానం చేశారు. రాజమహేంద్రవరం వాసుల దాతృత్వంపై ఎక్కడె క్కడి నుంచో తరలివచ్చిన భక్తజనం ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఎస్పీ భద్రత ఏర్పాట్లు పరిశీలన

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ ప్రదేశాల్లోని భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ పరిశీలించారు. తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ బందోబస్తుపై సూచ నలు చేశారు. ఆలయాల వద్ద క్యూలైన్లు పార్కింగ్ ప్రదేశాలను గమనించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అవాంఛనీయ ఘట నలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలుతగా స్నానాల ఘాట్లకు చేరుకున్న ఎస్పీ స్నానాలకు వెళుతున్న భక్తులను గమనిస్తూ లోతుకు వెళుతున్న వారిని హెచ్చరించాలన్నారు. భక్తుల భద్రతలో ఎలాంటి ఇబ్బందీ రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని డీఎస్పీలను ఆదేశించారు.



దీపాలు వదులుతున్న దంపతులు



గోదారంతా జనం : కొవ్వూరులో కిక్కిరిసిన గోష్పాదక్షేత్రం

గోదావరి స్నానానికి వచ్చి మహిళ అదృశ్యం



కొవ్వూరు, మార్చి 8 : శివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో గోదావరి పుణ్యస్నానానికి వచ్చిన మహిళ అదృశ్యమైంది. చిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన మేడపాటి వెంకటలక్ష్మి(45) శుక్రవారం శివరాత్రి సానానికి కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చింది. తనతో తెచ్చుకున్న బ్యాగు, సెల్‌ఫోన్ గట్టుపై వదిలిపెట్టి నదిలో దిగి అదృశ్యమైంది. స్థానికులు వెంకటలక్ష్మి బ్యాగులో ఫోన్ తీసి కుటుంబీకులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న వెంకటలక్ష్మి కుటుంబీకులు గోష్పాదక్షేత్రానికి చేరుకుని వెతికినా కనిపించక పోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.వెంకటలక్ష్మికి భర్త శ్రీనివాసరెడ్డి,(ఇద్దరు పిల్లలు) కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రాజమహేంద్రవరం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి పురందేశ్వరి?

టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తు నేపథ్యంలో ప్రచారం



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తు ఖరారవుతుందని..దీనిలో భాగంగా బిజెపి రాజమహేంద్రవరం లోక్‌సభను కూడా కోరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే ఖాయమైతే ఈ లోక్‌సభ స్థానం నుంచి ఎన్‌టీఆర్ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసే అవ కాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బీజేపీ వర్గాల్లో ఆనందం పెరిగింది. గతంలో ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థి గెలిచిన సందర్భాలు ఉన్నా యి. జిల్లాలో కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల విషయంలో కొంత వరకూ స్పష్టత ఉన్న సంగతి తెలిసిందే. కానీ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి విషయంలో ఇంతవరకూ స్పష్టత లేదు. గత ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసి ఓడిపోయిన మాగంటి రూప తర్వాత నియోజకర్గంలో తిరగలేదు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షనేత లేనట్టుగా ఉంది. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి కెఎస్ జవహర్ వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉంటే రాజమహేంద్రవరం నుంచి బీజేపీ పోటీ చేస్తుందని చాలా రోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. రెండురోజులుగా చంద్రబాబు, పవన్ ఢిల్లీలోని బీజేపీ పెద్దలు అమిత్‌షా, నడ్డాలతో చర్చించిన సంగతి తెలిసిందే. పొత్తు ఖరారైనట్టు, సీట్ల విషయంలో కూడా ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. బిజెపి అడిగే పార్లమెంట్ సీట్లలో రాజమహేంద్రవరం కూడా ఉండడం గమనార్హం. టీడీపీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్ సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగుసార్లు, వైసీపీ ఒకసారి గెలిచింది. ఇక్కడ ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీ అభ్యర్థి పోటీ చేస్తే గెలుపు అనుకూలంగానే ఉంటుందనే అభిప్రాయం ఉంది. ఇప్పటికే వైసీపీ అభ్యర్థిగా డా. గూడూరి శ్రీనివాస్ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ టీడీపీ నుంచి బొడ్డు వెంకటరమణచౌదరితో పాటు పలువురు టికెట్ ఆశించిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం బీజేపీకి కేటాయిస్తున్నట్టు ప్రచారం జరగడంతో పురందేశ్వరినే ఇక్కడ అభ్యర్థిగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది.

జెండాలు పీకితే ఊరుకోం

- వంగలపూడిలో జెండాలు పీకబోయిన అధికారులు
- ఎస్ఐతో జనసేన టీడీపీ నాయకుల వాగ్వాదం

సీతానగరం,మార్చి 8 : ఎమ్మెల్యే చెబితే ఫ్లెక్సీలు పీకేస్తారా అంటూ టీడీపీ జనసేన నాయకులు ఆందోళనకు దిగారు.సీతానగరం మండలం వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద శివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టిసం వీరేశ్వరస్వామి ఆల యానికి వెళ్లే మార్గంలో వంగలపూడి ఏటిగట్టు నుంచి పట్టిసం ఆలయం వరకు భారీగా జనసేన, టీడీపీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పార్టీ జెండాలు కట్టారు. అయితే అక్కడ వైసీపీ జెండాలు పెద్దగా కనిపించడం లేదు. ఏర్పాట్ల పరిశీలనకు రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వచ్చి వెళ్లారు. ఆ తరువాత వంగలపూడి పంచాయతీ కార్యదర్శి, సీతానగరం ఎస్ఐ జనసేన, టీడీపీ జెండాలను తొలగించడం ఆరంభించారు. రెండు జెండాలు తీసేసరికి జనసేన, టీడీపీ కార్యకర్తలు,నాయకులు అడ్డగించారు. నాయకులు గద్దే సురేష్, ఫణి, కాండ్రు పోసిరత్నం ,వలవల రాజా అక్కడకు చేరుకుని జెండాలు పీకితే ఊరుకోమని హెచ్చరించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.ఎమ్మెల్యే చెబితే జనసేన, టీడీపీ జెండాలు పీకేస్తారా అంటూ సీతానగరం ఎస్ఐని ప్రశ్నించారు. ఎస్ఐ మాట్లా డుతూ జెండాలు మాత్రమే తొలగిస్తున్నామని, ఫ్లెక్సీలు తొలగించడం లేదని చెప్పగా ఒక్క జెండా కూడా పీకడానికి వీల్లేదని జనసేన టీడీపీ నేతలు గట్టిగా చెప్పారు. దీంతో జెండాలు పీకే కార్యక్రమాన్ని విరమించారు.

గ్యాస్ ధర రూ.100 తగ్గింపు



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 8 : సాధారణ గృహ వినియోగదారులు వినియోగించే వంట గ్యాస్ ధరను రూ.100లు తగ్గిస్తూ మహిళా దినోత్సవం సంద ర్భంగా ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం డొమెస్టిక్ వంట గ్యాస్ ధర రూ.933లుగా ఉంది. రూ.100లు తగ్గించడంతో ఈ ధర రూ.833లకు చేరుతుంది. అయితే ఇది శనివారం నుంచి అమల్లోకి రానుంది. దీంతో ఇప్పటికే గ్యాస్ బుక్ చేసుకున్నవారికి ఈ ధరలు వర్తించే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్యాస్ సబ్సిడీ నామమాత్రంగానే ఉంది. రూ.3 నుంచి రూ.5లలోనే గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నారు. ఆ సబ్సిడీ కూడా పెంచాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ కేంద్రం ఇప్పుడు రూ.100లు తగ్గిస్తూ ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిడదవోలు నుంచి పోటీకి రెడీ..



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8 :జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీకి నేను రెడీ అంటున్నారు. దీనిలో భాగంగా నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కందుల లక్ష్మీ దుర్గేష్ ఎన్నికల ప్రచార వాహనాన్ని శుక్రవారం రాజమహేంద్రవరంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అభ్యర్థి దుర్గేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు రిబ్బన్ కట్ చేసి ఎన్నికల ప్రచార వాహనం ప్రారంభించారు.

అడకత్తెరలో వైసీపీ

వలంటీర్‌కు అందలం.. కేడర్ నిరుత్సాహం

- వలంటీర్లకు తాయిలాలు..కేడర్‌లో గుస్సా
- కనీస విలువలేదని కార్యకర్తల ఆందోళన
- పార్టీకి దూరమవుతున్న కేడర్
- జీతాలు పెంచకుండా... గిఫ్టులు, సన్మాలేనా..
- వలంటీర్లలో గూడుకట్టుకున్న ఆవేదన
- జిల్లాలో 9,300 మంది వలంటీర్లు
- వలంటీర్ల ఖాళీలు 150

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. సిమ్‌లేని సెల్‌ఫోన్‌లా క్యాడర్ పరిస్థితి ఉంటే..బ్యాలెన్స్ సెల్‌ఫోన్‌లా వలంటీర్ల పరిస్థితి ఉంది. అయినా వైసీపీ అధిష్ఠానానికి వీళ్ల గురించి ఆలోచించే యోచనే లేదు. వీళ్లను వాడుకోవడమే వైసీపీ లక్ష్యం. అరకొర జీతాలతో ఇబ్బంది పడుతూ వివిధ వర్గాలకు పింఛన్లు అందిస్తూ, కొందరి మెప్పు, కొందరి శాపనార్థాలు భరిస్తూ వలంటీర్లు బతుకీడుస్తున్నారు. వలంటీర్లు ఇటీవల జీతాలు పెంచమని కోరితే అనేక మందిని ఉద్యోగాల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కొందరికి నయానో భయానో నచ్చచెప్పి ఈ ఎన్నికల్లో వారిని ఉపయోగించుకోవాలని వైసీపీ ప్లాన్ చేసింది. అందుకే వారికి జీతాలు పెంచకుండా, అవార్డులు, సన్మానాలు చేయడంతో పాటు, ఇటీవల గిఫ్టులు ఇస్తున్నారు.వలంటీర్లను కేవలం ఈ గిఫ్టులతో వలలో పడేసుకోవాలనేది వైసీపీ ఎత్తుగడ. వాస్తవానికి వలంటీర్లంతా వైసీపీకి చెందిన వారు కాదు. ఇటీవల వాళ్ళలోని అనేక మంది ఆలోచన మారింది. అందులో వైసీపీతో పాటు, టీడీపీ, జనసేన పార్టీల అభిమానులు ఉన్నారు. వాళ్లను ఉద్యోగులుగా గుర్తిసే ఆనందించేవారు. కేవలం సన్మానాలు, అవార్డులు, గిఫ్టులతో పూర్తిగా వాడేసుకోవాలనుకుంటే పడేటట్టు లేరు. వలంటీర్ల పరిస్థితి ఇలా ఉంటే.. వలంటీర్లకు సన్మానాలు, అవార్డులు, గిఫ్టులు ఇవ్వడం వల్ల వైసీపీ అభిమానులు, కార్యకర్తల్లో ఆక్రోశం పెరుగుతోంది. గత ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి కార్యకర్తలు సర్వం త్యాగం చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరినీ కరివేపాలా తీసి పక్కన పెట్టేశారు. కనీసం ప్రతిఫలం దక్కలేదు. కనీస గౌరవం వారికి దక్కలేదు. కార్యకర్తల వల్ల ఏ పనీ కాకపోవడంతో కార్యకర్తలను ప్రజలు పట్టించుకునే పరిస్థితే లేదు. ఈ నేపథ్యంలో వైసీపీ కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఐదేళ్ల పాటు కనీసం తమను పట్టించుకోకుండా ఎన్నికల వేళ పిలుస్తుండడంతో పాటు వైసీపీని గెలిపించే బాధ్యత కార్యకర్తలదే అన్నట్టు నేతలు మాట్లాడుతుండడంతో మరింత ఆగ్రహానికి గురవుతున్నారు. కనీసం ఎన్నికల వేళ కూడా వలంటీర్లకు ఇచ్చే గిఫ్టులు తమకు ఇవ్వడం లేదని, తామెందుకు వీళ్ల వెంట ఉండాలనే వాదన కూడా కొంత మంది చేస్తున్నారు. ఈసారి ఎన్నికలు వాళ్లే నిర్వహించుకుంటారులే అనే నిర్ణయానికి కూడా కొంతమంది వచ్చారు.గతంలో బిర్యాని పొట్లం, మందు, బండికి పెట్రోలు పోయిస్తే ఊగిపోతూ వచ్చేసేవారు. ఇవాళ ఆ పరిస్థితి లేదు. వైసీపీకి త్యాగాలు చేయడం వల్ల ఫలితం శూన్యమనే నిర్ణయానికి కేడర్‌లో చాలా మంది వచ్చేశారు. ఎవరో నాయకుడిని నమ్ముకుని పనిచేసినా, గెలిచిన తర్వాత తనకు కావాల్సిన వాళ్లను పట్టించుకోవడం, పార్టీ కార్యకర్తల పట్ల శీతకన్ను వేయడం,నామినేటెడ్ పదవులు తమకు కావలసిన వారికే ఇచ్చుకోవడం, ఇతర పార్టీ వాళ్లను తీసుకుని వాళ్లకు పదవులు ఇవ్వ డం వంటి సంఘటనలతో అసలు సిసలైన కార్యకర్తలు నిర్వీర్యమైపోతున్నారు. ఇక్కడ వలంటీర్లు సంతృప్తిగా లేరు. క్యాడర్ సంతృప్తిగా లేదు. ఇక వైసీపీ కొందరి చేత ఇంటింటా సర్వే చేయిస్తోంది. వలంటీర్లను పంపించి, మామూలుగా మాట్లాడించి, ఎవరు, ఏకుటుంబం ఏపార్టీకి ఓటేస్తుందో తెలుసుకోవాలని పురమాయించినట్టు సమాచారం. ఇక్కడ కూడా కార్యకర్తలను వైసీపీ నమ్మడం లేదు.దీంతో క్యాడర్‌లో మరింత నిరుత్సాహం పెరుగుతోంది. పైగా ఇటీవల టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా వలంటీర్లను ప్రోత్సహించి.. వాళ్ల భవిష్యత్ బాగుండేలా చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో వైసీపీ క్యాడర్ మాత్రం వలంటీర్లకు లభించిన గుర్తింపు కూడా తమకు లభించలేదనే ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ 9,300 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో ఇటీవల జీతాలు పెంచమని కోరినందుకు చాలా మందిని ఉద్యోగాల నుంచి తీసేశారు. చాలా మందికి నోటీసులు ఇచ్చి బెదిరించారు. కొందరు వ్యక్తిగత కారణాల వల్ల మానేశారు. ఇలా ఖాళీలు 150 ఉన్నాయి. ప్రస్తుతం పనిచేసేవారిలో కూడా తమకు జీతాలు ఇక పెంచుతారనే నమ్మకం లేకుండా పోయింది. ఎన్నికల 2 నెలలు వీళ్లకు జీతాలు ఇచ్చే అవకాశం లేదు. కొందరు వైసీపీ నేతలు ఈ విషయాన్ని కూడా స్పష్టం చేసి.. మీకెవరు డబ్బులిస్తారు. ఇస్తే మేమే ఇవ్వాలి..కాబట్టి చెప్పినట్టు పనిచేయాలని ఆదేశిస్తున్నారు. ఈ పరిస్థితి వాళ్లకు ఇబ్బందిగా మారింది.ఈ నేపథ్యంలో వైసీపీ పరిస్థితిలో అడకత్తెరలో పడినట్టు అయింది.

రాజానగరంలో ఇప్పుడే ఉగాది కానుక..!

రాజానగరం, మార్చి 8 : వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రాజానగరంతో పాటుగా పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ నూతన దుస్తులు పంపిణీ చేశారు. తొలుత వలంటీర్లను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించిన అనంతరం కొత్త చీరలు, కొత్త బట్టలను రహస్యంగా పంపిణీ చేసినట్టు సమాచారం.ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్లకు కొత్త బట్టలు అందజేయడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూత న వస్త్రాల పంపిణీ తతంగమంతా ఎమ్మెల్యే సతీమణి చేతుల మీదుగానే సాగుతున్నట్టు తెలిసింది.ప్రతి ఏడాది ఉగాది పండగకు నూతన వస్త్రాలు అంద జేయడం జరుగుతోందని..ఈ ఏడాది ముందుగానే వలంటీర్లకు అందజేయడం జరిగిందని అధికార పార్టీ నాయకులు,వలంటీర్లు చెప్పడం గమనార్హం.



ఘనంగా..మన పండుగ..

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 8 : ఎప్పుడూ బిజీబిజీగా గడిపే జిల్లా అధికారిణులు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విధులకు కాస్త బ్రేక్ ఇచ్చి ఆనందంగా గడిపారు.. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఒకరికొకరు తినిపించుకుని పండుగ చేసుకున్నారు. మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతల నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడం చిన్న చిరు నవ్వుతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ మాధవీలత అన్నారు. మన కోసం రోజులో కొంత సమయం కేటాయించుకోవడం, వ్యాయామం చేయడం, మనసుకి ఇష్టమైన వ్యాపకం చేసుకోవడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులతో పాటు జిల్లా అధికారులు జి.నరసింహులు, ఆర్.కృష్ణనాయక్,బీవీఎస్.రాఘవరావు, కలెక్టర్ సీసీ వెంకటేష్, డీటీలు ఎం.సునీల్, సురేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మంత్రిగారు వస్తారా..?చూపిస్తా!

ధవళేశ్వరం, మార్చి 8 : మంత్రి గారూ స్వచ్ఛత అంటూ ఫొటోలకు ఫోజులెందుకండి దండగ.. మీరు వస్తానంటే చోటు నే చెబుతా రండి అంటూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గోరంట్ల ధవళేశ్వరంలో పేరుకుపోయిన చెత్తన చూపించి వైవిధంగా స్పందించారు.స్వచ్ఛత మన అందరి బాధ్యత అంటూ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేసే బాధ్యత తనది అన్నట్టు గ్రామాల్లో హడావుడి చేస్తున్న మంత్రిగారికి రహదారులపై పలు చోట్ల పేరుకుపోయిన చెత్త కనిపించడం లేదా అంటూ ఎద్దేవా చేశారు. హడావుడి వద్దు పనిచేయండన్నారు.

మహిళలకు ఎంపీ చీరల తాయిలం

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు తాయిలాల పంపిణీలో బిజీగా గడుపుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత చిక్కులు వస్తాయని ముందుగానే 'సర్దేస్తున్నారు'. ఎంపీ భరత్ రామ్ బుధవారం(6న) మధ్యాహ్నం డ్వాక్రా మహి ళలు, వార్డుల ఇన్‌చార్జులతో ఆనం కళా కేంద్రంలో సభ ఏర్పాటు చేశారు. యథావిధిగా ఊకదంపుడు ప్రసంగాన్ని ఏకరువు పెట్టారు. అక్కలు, చెల్లెమ్మలు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. తర్వాత అసలు కార్యక్రమం మొదలైంది. మహిళలకు దర్జాగా బహిరంగంగా భారీగా చీరలు అందజేయడం గమనార్హం. అంతకుముందు విలేకరులకు బహుమతులు ఇచ్చిన విషయం విదితమే.



దర్జాగా.. బహిరంగంగా : ఆనం కళాకేంద్రంలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్



రాజమండ్రి కోటిలింగాల రేవు వద్ద భక్తుల రద్దీ



రాజమండ్రి పుష్కరాల రేవు వద్ద భక్తులు

భక్తజన హోరు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



క్యూలో భక్తులు

కిక్కిరిసిన ద్రాక్షారామ

ద్రాక్షారామ, మార్చి 8: ద్రాక్షారామ భక్తజన సంద్రంగా మారింది. భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4.00 గంటల నుంచి భీమేశ్వర స్వామివారి దర్శనానికి భక్తుల రాక మొదలయ్యింది. ఉదయం 10 గంటల ప్రాంతానికి తీవ్ర రద్దీ నెలకొంది. క్యూలైన్లలో భక్తులు బారులుతీరారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మ వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 8 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు జరిగాయి. రాత్రి 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రిపూజ నిర్వహించారు. 12 గంటలకు మహానివేదన చెల్లించారు. రాత్రి 1.30 వరకు స్వామిని భక్తులు దర్శించుకున్నారు. చండీ హోమ పండితులు ఇంద్రకంటి రామారావుశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో జ్యోతిర్లింగార్చన జరిగింది. ఆలయ ఉత్సవ అధికారి, దేవదాయశాఖ ఉప కమిషనరు ఎం.విజయరాజు పర్యవేక్షణలో, ఈవో పి.టి.వి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఇతర ఆలయాల సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు.



పూలు, విద్యుత్ దీపాలతో అలంకరణ

అఖండ దీపారాధన

ద్రాక్షారామలో దక్షగుండం వద్ద వేంచేసియున్న ఘంటాంబిక అమ్మవారి ఆలయం వద్ద మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అఖండ దీపారాధన జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, వ్యాపారవేత్త సత్తి సుబ్బారెడ్డి దంపతులు అఖండ దీపారాధనను ప్రారంభించారు. కోటిపల్లి రోడ్డులో అమ్మవారి ఆలయ గోపురం వద్ద నుంచి ఆలయం వరకు ఇరువైపులా స్టాండ్లు ఏర్పాటు చేసి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. సుమారు 300 మీటర్లు పొడవునా ఇరువైపులా దీపారాధన జరిపారు. అదే విధంగా ఆలయం వద్ద శివలింగాలు చెక్కలతో ఏర్పాటు చేసి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. ద్రాక్షారామ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుష్ప శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు.

భీమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు



అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

సామర్లకోట, మార్చి 8: హరహర మహాదేవ శంభో శంకర అంటూ పంచారామ పుణ్య క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో క్యూలైన్లన్నీ కిక్కిరిసాయి. క్యూలైన్లు, వీఐపీ దర్శనాలకు ఏర్పాటు చేసిన మార్గాల వద్ద తీవ్రమైన రద్దీ, తోక్కిసలాటలు జరిగాయి. సకాలంలో పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. బందోబస్తు చర్యలను డీఎస్పీ కె.లతాకుమారి ఎప్పటికప్పుడు సమీక్షించారు. కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణిల వద్ద తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దాతలు ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టాల వద్ద కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కెనాల్ రోడ్డు పొడవునా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో పలు దఫాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా సామర్లకోట మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆలయ ఆవరణలో సమగ్ర పారిశుధ్యచర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. భక్తుల క్యూలైన్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చీఫ్ ఫెస్టివల్ అధికారిణి అల్లు వెంకట దుర్గాభవాని సిబ్బందికి తగు సూచనలు చేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్నానాలాచరిస్తున్న భక్తులు

భక్తజన సంద్రం

..పాదగయ క్షేత్రం

పిఠాపురం, మార్చి 8: శివనామసర్మణతో పిఠాపురం మారుమోగింది. పట్టణ వీధులన్నీ భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. పాదగయ పుష్కరిణిలో స్నానాలకు, కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పిఠాపురం పట్టణం భక్త జన సంద్రమైంది. పాదగయ క్షేత్రానికి తరలివచ్చే రహదారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము సమయానికే పాదగయ బయట కిలోమీటరు మేర భక్తులు బారులు తీరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమయిన భక్తుల రద్దీ రాత్రి వరకూ కొనసాగింది. పాదగయ పుష్కరిణిలో సుమారు 3 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అంచనా. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వర స్వామి ఆది శంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, స్వయంభూ దత్తాత్రేయస్వామి అష్టాదశ శక్తిపీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను, ఇతర ఉపాలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కుక్కుటేశుని నిజరూప దర్శనం

గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట నుంచి కుక్కుటేశ్వరస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. కుక్కుటేశ్వరస్వామికి లక్షబిల్వార్చన, రాజరాజేశ్వరీదేవి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు. రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. జనసేన నియోజకవర్గ నేత డాక్టర్ పిల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

కోటిపల్లి పుణ్యక్షేత్రం కిటకిట





క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

కె.గంగవరం, మార్చి 8: కోటిపల్లి పుణ్యక్షేత్రం కిక్కిరిసింది. స్వామి వారికి వేకువజామున గోదావరి నది నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి బాలభోగం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీ ఛాయా సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, దేవస్థానం ఈవో ఎం.శ్రీదేవి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆర్యవైశ్య సంఘం వారు, కాకతీయ సంఘం, శాలివాహన సంఘం, సైండా వారి అన్నసత్రం, మాన్సాస్ ట్రస్టుతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోటిపల్లి ఫెర్రీ రేవులో తెలుగుదేశం పార్టీ నాయకుడు రేవు శ్రీను పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. రామచంద్రపురం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు శాఖ బందోబస్తు నిర్వహించింది. ఫెర్రీ రేవు, స్నానఘట్టాలు, రేవులోని బస్‌స్టాండ్, రేవులో నుంచి దేవస్థానానికి వచ్చే రహదారి, ఆలయం లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. పామర్రు ఎస్ఐ జానీ బాషా కంట్రోల్ రూం వద్ద నుంచి పరిస్థితిని పర్యవేక్షించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం క్యూలైన్లలో ఉన్న భక్తుల వద్దకు వెళ్లి ఏర్పాట్లు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ చేశారు. తహసీల్దార్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సేవలందించారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పిల్లి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ అయినవిల్లి అబ్బు పూజలు చేశారు.

మహిళలు ఉచిత న్యాయ సహాయం పొందాలి

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడానికి మహిళలందరూ అర్హులేనని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళా ప్రత్యేక కారాగారంలో నిర్వహించిన వేడుకలకు హాజరై మహిళా ఖైదీలు, జైలు సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కారాగారంలో ఉన్న మహిళలు ఏ విషయాల గురించీ ఆందోళన చెందవద్దన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాన్ని అవసరమైన మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మహిళలు, పిల్లలు, బడుగు బలహీన వర్గాలకు డీఎల్ఎస్ఏ అందిస్తున్న సేవల గురించి వివరించారు. వేడుకల్లో భాగంగా మహిళలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఐజీ ఎంఆర్ రవికిరణ్, ఓఎన్జీసీ సీజీఎం మనీష శర్మ, జీఎం సంగీత సాహు, కారాగార సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముమ్మిడివరంలో బాలయోగీశ్వరుల తీర్థం





ముమ్మిడివరం, మార్చి 8: శివరాత్రి తర్వాత రోజైన శనివారం జరిగే బాలయోగీశ్వరుల తీర్థం చాలా ప్రాముఖ్యమైనది. దీక్షలో ఉండగానే 1985 జూలై 19న పెదబాలయోగీశ్వరులు, ఆ తర్వాత 1991 అక్టోబరు 28న చినబాలయోగీశ్వరులు కైవల్య సిద్ధి పొందారు. వారిని తపో మందిరంలోనే సమాధి చేశారు. నేటికీ ఆ సమాధులను దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. బాలయోగీశ్వరుల తీర్థాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల ఆశ్రమాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం శివరాత్రి సందర్భంగా బాలయోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన, రాత్రి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 4 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మండపంపై బాలయోగీశ్వరుల విగ్రహ దర్శనం, సమాధుల దర్శనం ఉంటుంది. దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆశ్రమ కమిటీ, కుటుంబ సభ్యులు వసతి, భోజనం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.





అవార్డు అందుకుంటున్న రవితేజ

ఉత్తమ పోలీసు అధికారిగా వాసంశెట్టి రవితేజ

మామిడికుదురు, మార్చి 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన వాసంశెట్టి రవితేజ ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు అందుకున్నారు. రవితేజ ప్రస్తుతం గుజరాత్‌లోని గాంధీనగర్ ఎస్పీగా పనిచేస్తున్నారు. గురువారం జరిగిన సమావేశంలో గుజరాత్ రాష్ట్ర డీజీపీ వికాస్ సాహి నుంచి ఉత్తమ పోలీసు అధికారి అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని రవితేజ అందుకున్నారు. ఈ మేరకు ఆయన తండ్రి, హైకోర్టు న్యాయవాది వాసంశెట్టి నాగేశ్వరరావు వివరాలు తెలిపారు. కోనసీమలోని మారుమూల గ్రామంలో జన్మించిన రవితేజ 2015 ఐపీఎస్ బ్యాచ్ నుంచి ఎంపికై గుజరాత్‌లో సమర్థవంతంగా విధులు నిర్వహించి అక్కడి ప్రజల మన్ననలు పొందారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఇతర రాష్ట్రంలో అవార్డు అందుకోవడంపై పెదపట్నంలంక గ్రామ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాన్-ఆటో ఢీ

పట్టుబడిన రేషన్ బియ్యం

గండేపల్లి, మార్చి 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం జెడ్.రాగంపేట గ్రామ శివారులో శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి బి.ప్రత్తిపాడు వెళుతున్న వ్యాన్ జెడ్ రాగంపేట వచ్చేసరికి డివైడర్‌పైకి ఎక్కి రైలింగ్ దాటి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటోతో పాటు మినీ వ్యాన్ బోల్తా పడింది. అయితే ఆటోలో రోడ్డు వర్కింగ్ కూలీలు నలుగురికి గాయాలయ్యాయి. వారిని పోలీసు హైవే పెట్రోలింగ్ సిబ్బంది చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఐషర్‌వ్యాన్‌లో ఉన్న రేషన్ బియ్యం బస్తాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అయితే ఈ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. విజయవాడ నుంచి బి.ప్రత్తిపాడులోని ఒక షాపునకు బియ్యం తరలిస్తున్న బి. ప్రత్తిపాడుకు చెందిన వెలుగుల వాసుపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ సీఐ రాజు, డీఎస్‌వో ప్రసాద్, సిబ్బంది బియ్యం స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి అతనిపై కేసు నమోదు చేశారు.

పట్టుబడిన రేషన్ బియ్యం



ఫైనాన్స్ కంపెనీలో రూ.12 లక్షల చోరీ





సీసీ కెమెరాల్లో రికార్డయిన నిందితుల దృశ్యాలు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నీసుపేట పాత స్టేట్‌బ్యాంకు మొదటి అంతస్తులో ఒక ఫైనాన్సు కంపెనీ కార్యాలయం ఉంది. అందరూ శివరాత్రి హడావుడిలో ఉండగా అగంతకులు శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇనుపరాడ్డుతో షట్టరును బలవంతంగా మనిషి దూరే ఎత్తుకు పైకిలేపి లోనికి ప్రవేశించారు. లోపల టేబుల్ సొరుగు తాళాన్ని స్క్రూడ్రైవర్లతో తొలగించి సుమారు రూ.12 లక్షల నగదును అపహరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వాళ్ల ఫొటోలను ఎస్పీ జగదీశ్ మీడియాకు విడుదల చేశారు. దొంగల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 వేల బహుమతి అందజేస్తామని ప్రకటించారు. టూటౌన్ సీఐ ఫోన్ 9440796576 లేదా సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఫోన్ 9490760791కి సమాచారం అందించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంతా ఉంచుతామన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఆటో డ్రైవర్ మృత్యువాత



గొల్లప్రోలు, మార్చి 8: ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ మరణించాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి చెందిన రాయి సూర్యచంద్ర(32) పిఠాపురం నుంచి గొల్లప్రోలుకు ఆటో నడుపుకుంటూ వెళుతుండగా, బైపాస్ రోడ్డులో వై జంక్షన్ వద్దకు వచ్చేసరికి కత్తిపూడి నుంచి పిఠాపురం వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ సూర్యచంద్రను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించినట్లు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శివునిలో సగం..అవనిలో సగం

రంగంపేట, మార్చి, 8 : మహాశివరాత్రి, మహిళా దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం రంగంపేటకు చెందిన ప్రముఖ సైకతశిల్పి దేవిన శ్రీనివాస్ 150 సంవత్సరాల చరిత్ర కలిగిన రంగంపేట శివాలయంలో అమ్మవారి సైకత శిల్పాన్ని పండ్లు, కూరగాయలతో చెక్కారు. శివునిలో సగం - అవనిలో సగం మేమే.. అనే నినాదంతో వినూత్నంగా తీర్చిదిద్దారు.

ఏజెన్సీ సమాచారం

శంభో..శివ శంభో

మహాశివరాత్రిని పురస్కరించుకుని కిటకిటలాడిన శైవక్షేత్రాలు

రంపచోడవరం, మార్చి8: రంపచోడవరం మండలం రంపలోని చారిత్రాత్మక మల్లిఖార్జునుడిని దర్శించుకోవడానికి శుక్రవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ శివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఆలయ కమిటీ ఉత్సవాలను నిర్వహిస్తోంది. పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లను చేసింది. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ రంప ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందిని భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భక్తులకు రంపచోడవరంలోని భాను సప్లయి కంపెనీ, రంపచోడవరం వర్తక సంఘం, ఇతర సంఘాల వారు భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రంప మల్లిఖార్జునుడి దర్శనానికి వచ్చిన భక్తుల కోసం శుక్రవారం జనసేన పార్టీకి చెందిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కాకి స్వామి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ నిర్వహించారు. దేవీపట్నం మండల పార్టీ అధ్యక్షుడు చారపు వెంకటరాయుడు, తురసం సీతారామాంజనేయులు, కుంజం శ్రీను, కొమరం దొరబాబు, తాల్లూరి పవన్‌కుమార్ రెడ్డి, అన్నిక సాయి పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తుల రద్దీ



జడ్డంగి శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు

రాజవొమ్మంగి మార్చి 8: మండలంలోని శివాలయాల్లో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడ్డంగిలో శివుని దర్శనం కోసం బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

మోతుగూడెం, మార్చి8: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామంలో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అయినవిల్లి కుమార్‌స్వామి శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ సతీష్ రాఘవన్, కార్యదర్శి ఎం.శివరామకృష్ణ, ట్రెజరర్ వేపకాయల శ్రీను, కమిటీ సభ్యులు, నాలుగురాష్ట్రాల వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాశివరాత్రి పూజలు

అడ్డతీగల, మార్చి 8: మహాశివరాత్రిని పురస్కరించుకుని అడ్డతీగలలో శివాలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి. అడ్డతీగల నాగలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజల అనంతరం మహా అన్నసమారాధన నిర్వహించారు. డి.భీమవరం రహదారిలో ఉన్న ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుల సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో శివ కల్యాణం నిర్వహించారు.

కిక్కిరిసిన శివాలయాలు

చింతూరు, మార్చి 8: చింతూరు మండలం, వీరాపురం వద్ద మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. విలీన మండలాల భక్తజనంతో పాటు సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. స్వయంభూ శ్రీరామలింగేశ్వర స్వామి శివలింగ ప్రాంగణంలో ప్రజాహిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారిచే ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యదర్శన ప్రదర్శిన, పరమ శివుని జలాభిషేకం, మహాహారతి తదితర అంశాలపై బోధించారు. ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు విశ్వచైతన్య ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఎడ్లవల్లి రామారావు, శ్రీరెడ్డి సతీష్‌కుమార్, పసుపులేటి రామకృష్ణ సంయుక్తంగా భక్తులకు అన్నదానం చేశారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఏర్పాట్లను పరిశీలించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎటపాక, ఫిబ్రవరి 8: గన్నవరంలోని శ్రీకాళి కార్తికేయ శివాలయం, గొల్లగూడెం గోదావరి ఒడ్డున ఉన్న శివాలయం, బుట్టాయిగూడెం, కన్నాయిగూడెం, ఎటపాక, బండిరేవు తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, శివుడిని దర్శించుకున్నారు. అనంతరం శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు.

గురమందకు తరలివచ్చిన భక్తులు

వై.రామవరం,మార్చి8: వై.రామవరం మండలంలోని గురమంద అటవీ ప్రాంతంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. చన్నీటి స్నానాలాచరించి మొక్కులు తీర్చుకున్నారు. శివలింగాలపై పడుతున్న నీటి బిందువులు, అలాగే సంతాన ప్రాప్తి ప్రసాదించే నందీశ్వరులు, దేవతలు చెక్కిన శిల్పాలు వంటి ఎన్నో వింతలను వీక్షించి భక్తులు తన్మయత్వం చెందారు. అడ్డతీగల సీఐ రవికుమార్ బందోబస్తు పరిశీలించారు. రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి శుక్రవారం మండలంలోని గురమంద శివాలయాన్ని దర్శించుకున్నారు.



ఆలయంలో వంతల పూజలు

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, ఆలయ కమిటీ కన్వీనర్ పల్లాల వెంకటరమణారెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వీకా నర్సన్నదొర, అడ్డతీగల కాంగ్రెస్ పార్టీ నాయకులు దంగేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మరో శైవక్షేత్రం పూతిగుంటకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ ప్రకృతి జలపాతాల నడుమ స్నానాలాచరించి సందడి చేశారు.

శివరాత్రి పూజలు

కూనవరం,మార్చి8: మండలంలోని మద్దిగూడెం పంచాయతీలోని కొమరస్వామి గుట్ట ఆలయంలో వెలసిన వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఉచితంగా అన్నదానం నిర్వహించారు. గోదావరి శబరి సంగమం వద్ద ఉన్న శివాలయంలోను భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వేళ జాతర జరిగింది.

మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాడాలి

రాజవొమ్మంగి మార్చి 8: మహిళ దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో సీఐటీయూ మండలాధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ మహిళ దినోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించారు. మహిళ దినోత్సవ స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం గళం విప్పాలని సూచించారు. అలాగే కింద్ర గ్రామంలో రామాలయం వద్ద ఎంపీపీ గోము వెంకటలక్ష్మిని డ్వాక్రా మహిళలు సన్మానించారు.

రొట్టె, పాలు పంపిణీ

చింతూరు, మార్చి8: మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు చింతూరు ఏరియా ఆస్పత్రిలో పాలు రొట్టె పంపిణీ చేశారు. సిబ్బందికి మిఠాయిలు అందజేశారు. వాసం సుజాత, మిడియం సుజాత, తులసి, కవిత, సీత, మీన, పాండ్రుం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

చింతూరు, మార్చి 8 : కుమ్మూరులో అగ్ని ప్రమాద బాధితుడు అనిగి పొట్టి కుటుంబానికి చింతూరు మండల టీడీపీ కమిటీ శుక్రవారం నిత్యావసర సరుకులు అందించింది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, నాయకులు శీలం తమ్మయ్య తుర్రం చిన్నముత్తయ్య పొదిలి రామారావు, పసుపులేటి సాల్మన్‌రాజు, ఆకోజు నూకాచారి, రవ్వ సునీత, కుంచ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల చేతులమీదుగా హుండీ అందజేత

ధవళేశ్వరం, మార్చి8: స్థానిక కంచర్‌లైన్ వద్ద ఉన్న శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయానికి టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి సమకూర్చిన హుండీని శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎర్రకొండపై శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, సీనియర్ నాయకులు మార్నివాసు దేవరావు, పండూరి అప్పారావు, పిన్నంటి ఏకబాబు, నీలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కడియపులంకలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల



భక్తులకు అన్నప్రసాదాలు అందించి మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు



ధవళేశ్వరం: ప్రత్యేక అలంకరణలో అగస్తేశ్వర స్వామి,బాలాత్రిపుర సుందరి

శంకర..హర హర

● వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు
● మార్మోగిన శివనామస్మరణ

ధవళేశ్వరం, మార్చి8: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.పురాణ ప్రసిద్ధిగాంచిన అగస్తేశ్వరస్వామి ఆలయం, విద్యాధరేశ్వర స్వామి ఆలయం, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు చేశారు.రామపాదాల రేవులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో అభిషేకాలు అనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు పలుచోట్ల ప్రసాదాలు, అల్పాహారం, మజ్జిగ వితరణ చేశారు.రాత్రికి ఆయా ఆలయాల్లో లింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు.

ఘాట్లలో ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు చేసే రేవులల్లో ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ పరిశీలించారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే రేవుల్లో పర్యవేక్షణకు సిబ్బందిని నియమించారు.పుష్కరాలరేవు, కోటిలింగాల రేవు, టీటీడీ ఘాట్,గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్లను పరిశీలించారు. ఎప్పటి చెత్తను అప్పటికప్పుడు తరలించే ఏర్పాట్లను పారిశుద్ధ్య విభాగంతో చేయించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ పీఎం.సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమణ, ఎం హెచ్‌వో డాక్టర్ వినూత్న, ఎస్ఈ పాండురంగారావు పాల్గొన్నారు.

41 మహాశివరాత్రి నృత్యోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 8 : శ్రీ ఉమా మార్కం డేయ స్వామి దేవస్థానంలో 41వ మహాశివరాత్రి నృత్యోత్సవం నాట్యపండితుడు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శుక్ర వారం వైభవంగా నిర్వహి ంచారు. భాను ప్రసాద్ అద్భుతంగా నర్తిం చారు.ఆలయ ఈవో ఆర్.శ్రీనివా సరావు,ఆలయ ప్రముఖులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్‌ను ఘనంగా

భక్తులకు అన్నప్రసాదాల వితరణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8: ప్రజలందరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించేలా పరమేశ్వరుడు చూడాలని టీడీపీ-జనసేన ఉమ్మడి రాజమండ్రి అసెంబ్లీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం గోదావరి స్నానాలకు వచ్చిన భక్తజనానికి ఆయన అల్పాహారం, అన్న ప్రసాద వితరణ చేశారు. పరమేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. మీనాక్షి సెప్టిక్లీన్ యూనియన్ ఓనర్స్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీసాయిరత్నం సేవా సమితి ఆధ్వర్యంలో కోటింగాలపేటలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద పులిహోర, మజ్జిగ వితరణ చేశారు. జాంపేట దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఉమా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిళా రెడ్డి హాజరై ప్రసాదం పంపిణీ చేశారు.



జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంవద్ద ప్రసాదవితరణ చేస్తున్న షర్మిళారెడ్డి

కడియంలో కిక్కిరిసిన ఆలయాలు

కడియం, మార్చి 8: కడియం మండలంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కడియం శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి, వేమగిరి శ్రీపార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి, వీరవరం శ్రీఉమారామలింగేశ్వర స్వామి, మాధవరాయుడుపాలెం శివాలయం, దుళ్ల శ్రీబాలాత్రిపురసుందరి అగస్తేశ్వరస్వామి, మురమండ సర్వకామదాంబ సోమేశ్వరస్వామి, జేగురుపాడు నగరేశ్వరస్వామి, పొట్టిలంక శ్రీపార్వతీ పరమేశ్వర ఆలయాలులో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

● కడియపులంకలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీఆంజనేయ స్వామి ఆలయంవద్ద శివరాత్రి వార్షికోత్సవం, గోదావరి తుల్యభాగానికి సమీపంలో ఉన్న హరిహర మహాక్షేత్రంలో అపర్ణాసమేత అనంతేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆంజనేయ, అపర్ణాసమేత అనంతేశ్వరస్వామిని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన నాయకులు కందుల దుర్గేష్, డీసీసీబీ చైర్మెన్ ఆకుల వీర్రాజు, చందన నాగేశ్వర్ తదితరులు దర్శించుకున్నారు. ఆంజనేయ, అనంతేశ్వర స్వామి ఆలయాల కమిటీల అధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, ఆలయకమిటీ సభ్యులు, నర్సరీ రైతులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన భారీ అన్నసమారాధన భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి అన్నప్రసాదాలు స్వీకరించారు.

రాజానగరం: రాజానగరంలోని శ్రీరాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి శ్రీనివాసరావు తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రసాద వితరణ చేశారు. తూర్పుగోనగూడెంలోని ఉమా శంకరస్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చక్రద్వారబంధం, నరేంద్రపురం, కలవచర్ల, సీతారాంపురం, నందరాడ, కానవరం, పల్లకడియం, తోకాడ, రాధేయపాలెం, ముక్కినాడ గ్రామాల్లో శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి.

వైభవంగా శివకేశవుల కల్యాణోత్సవం

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవిల్లి వెంకన్నబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాజానగరంలో తలపెట్టిన శివ కేశవుల కళ్యాణం, మహా శివరాత్రి జాగరణ మహోత్సవం కన్నులపండువుగా సాగింది. తొలుత శివ పార్వతుల ఉత్సవ మూర్తులను స్థానిక శివాల యం నుంచి బసవేశ్వర ముత్యాల వాహనంపై కోలాట నృత్య ప్రద ర్శనలతో గ్రామంలో భారీ ఊరేగింపు చేపట్టారు.

మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పించిన టీడీపీ

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 8: మహిళలు ఆర్థిక స్వాలంభన సాధించినపుడే కుటుంబం అభివృద్ధి సాధిస్తుందని పూర్తిగా నమ్మి వారిని ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుంచి వారి అభివృద్ధికి కృషిచేస్తూ వస్తోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళా దినోత్సవ కేక్‌ను కట్ చేసి తెలుగు మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు మహిళా నేతలను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, బేరా వేణమ్మ, పోతంశెట్టి సుభాషిణి, ఒంటిమి గౌతమి, చిన్నమ్మ, నాగమణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలతోనే దేశాభివృద్ధి

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళల పురోగతితోనే దేశాభివృద్ధి పరుగులు పెడుతుందని రైల్వే మహిళా ఉద్యోగులు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిరంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతుండడం హర్షణీయమన్నారు. మహిళలకు భారతీయ రైల్వే సముచిత స్థానాన్ని, గౌరవాన్ని ఇస్తోందని ప్రశంసించారు. కార్యక్రమంలో సీటీఎస్ఆర్ తిరుమలా దేవి, సీనియర్ టీసీ స్వరూప, టీటీఐలు మంగాదేవి, కృష్ణవేణి, డీఎస్ఆర్ సునీతారాణి పాల్గొన్నారు.

రైల్వే స్కౌట్స్‌లో మహిళా దినోత్సవం

మహిళా దినోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజరాజ నరేంద్ర, గోదావరి ఓపెన్ గ్రూప్ అసిస్టెంట్ జిల్లా కమిషనర్ డి.ప్రసాద్ ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. మార్షల్ ఆర్ట్స్, స్వీయ రక్షణపై కార్యక్రమాలు జరిగాయి. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్లు జి.నవతశ్రీ, ఎస్.అలేఖ్యను సత్కరించారు.

మహిళల హక్కులను పరిరక్షించుకోవాలి

రాజానగరం: అనేక ఉద్యమ పోరాటాలు ద్వారా మహిళలకు సంక్రమించిన హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మహిళలందరిపై ఉందని ప్రముఖ న్యాయవాది, మహిళా సంఘం జిల్లా నాయకురాలు కె.ప్రసన్న పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక దినోత్సవాన్ని ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యు ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యారావుపేటలో ఘనంగా నిర్వహించారు. పీవోడబ్ల్యూ నాయకురాలు బ్రాహ్మణపల్లి భవాని,ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు జె.సత్తిబాబు, జిల్లా నాయకులు ఎం.రాజు, రైతు నాయకులు దుర్గారావు, తుమ్మల కళావతి, బొలిశెట్టి సత్యవతి, తామర్ల గౌరి, నక్కా లక్ష్మి, దొమ్మ సీత, గోర్స దుర్గ, అరవాలమ్మ, సూరమ్మ, జగదాంబ పాల్గొన్నారు.

కడియం: కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కడియం సీహెచ్‌ఎన్‌సీలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేకు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. మోహనవంశీ, డా. అరుణ, సీనియర్ నర్స్ వలీమాలను ఘనంగా సత్కరించారు. డా. శిరీష, కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, పి.దేవానంద్, పిచిన్ని, యూ.ప్రసాద్‌బాబు, సుంకర శ్రీనివాస్, ఎన్.మెహర్‌సాగర్; సీహెచ్‌ఎన్‌బీ కామరాజు, పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్నరైల్వే మహిళా ఉద్యోగులు

ఘనంగా మహిళా దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8: రాజమహేంద్రవరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వీరభద్రపురం కస్తూరిబా ఆశ్రమంలో కెఎల్ శాంతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మహిళలతో కేక్ కట్ చేయించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ సమీపంలోని శానిటరీ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అల్లం ప్రసాద్ , కార్యదర్శి సిహెచ్ కిరణ్ ,శానిటరీ మేస్త్రీలు కలిసి ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, 20 మంది పారిశుద్ధ్య మహిళా కార్మికులనుసత్కరించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ఎంహెచ్‌వో కృషిని కొనియాడారు.

మహిళా సాధికారత దిశగానే బాబు పవన్‌ల నిర్ణయం

● తెలుగుమహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ



రాజమహేంద్రవరంసిటీ, మార్చి 8: టీడీపీ,జనసేన అధినేతలు చంద్రబా బు, పవన్ కల్యాణ్‌ల నిర్ణయాలు మహిళా సాధికారత దిశగానే ఉన్నాయని తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కలలకు రెక్కలు అనే ఒక కొత్త పథకాన్ని తమ నాయకులు తీసుకొచ్చార న్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన మహిళలు ఉపాధి నిమిత్తం ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ పథకానికి ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లింక్ పొందడానికి 92612 92612కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని చండీప్రియ కోరారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి రక్షణ కావాలి

● సమతా సైనిక్ దళ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు



సమతా సైనిక్ దళ్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8: కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను దారుణంగా హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు నుంచి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,మాజీ సైనికుడు పిల్లి సురేంద్రబాబు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరిలో శుక్రవారం సమతా సైనిక్ దళ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ అనంతబాబును ఇప్పటివరకు ప్రభుత్వం బర్తరఫ్ చేయకపోగా ఎమ్మెల్సీకి పూర్తిగా సహాయసహకారాలు అందిస్తుందన్నారు.ప్రభుత్వ అండదండలు, అహంకారంతో ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ బాధితులపై ఒత్తిడి తెస్తున్న అనంతబాబు నుంచి రక్షణ కల్పించాలన్నారు. నా ఎస్సీలు నా ఎస్టీలు అని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్ నిరుపేద దళిత కుటుంబమైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంకు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఫారూక్ సుబ్లీ, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బొంతు శ్యామ్, దళిత నాయకుడు షీతల్ తుర్లపాటి, శ్యామ్ కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, సుధీర్ కుమార్, గద్దె శ్రీకాంత్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ ప్రకటనపై విశ్వబ్రాహ్మణుల హర్షం

రాజమహేంద్రవరంరూరల్, మార్చి 8: టీడీపీ-జనసేన కూటమి ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్‌ను చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రకటించడం పట్ల తెలుగుదేశం పార్టీ విశ్వబ్రాహ్మణ సాధికార సమితి హర్షం వ్యక్తం చేస్తుందని రాజమహేంద్రవరంరూరల్ కన్వీనర్ కర్రి అప్పలస్వామి తెలిపారు. 50 ఏళ్ళుదాటిని విశ్వబ్రాహ్మణులందరికి రూ.4వేలు పింఛన్లు, బీసీ రక్షణ చట్టం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ శాతం 34కి పెంచడం, రూ.5వేల కోట్లతో ఆదరణ పథకం, రూ.10వేల కోట్లతో యువత ఉపాధి అవకాశాలు కల్పించాలనే బీసీ డిక్లరేషన్‌తో బీసీ వర్గాలన్నింటికి న్యాయం జరుగుతుందని అందుకు తమ నాయకుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కోఆర్డినేటర్ సింహాద్రి కనకాచార్యులు, గోడు నరింసింహాచారిలకు ధన్యవాదాలు తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: భీమా
సూర్యామినీ	: సైతాన్
సూర్యాప్యాలస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: భీమా
శివజ్యోతి	: భీమా
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమలు
రాజా	: భీమా
ఊర్వశి	: హనుమాన్
రంభ	: రికార్డు బ్రేక్
మేనక	: బాబు నెం.1, బుల్ షిట్..
అప్సర	: గామి
కుమారి	: గామి
వీఎస్ మహల్(నామవరం)	: భీమా
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: గామి
వెంకటసూర్య(కడియం)	: భీమా
సత్యగౌరి (అనపర్తి)	: భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యున్ సినిమాస్(రాజానగరం)	: గామి
రామకృష్ణ(కోరుకొండ)	: భీమా
గీతాసినిమాస్ (సీతానగరం)	: భీమా
శ్రీనివాస (గోకవరం)	: భీమా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహల్(రంపచోడవరం)	: భీమా
నవయుగ(చింతూరు)	: భీమా

కలలకు రెక్కలు పథకంతో

విద్యారుణానికి టీడీపీ, జనసేన గ్యారెంటీ

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 8: ఆడబిడ్డలు ఆర్థిక పరిస్థితి సహకరించక ఇంటికే పరిమితమౌతున్న ప్రస్తుత తరుణంలో వారి విద్యాభ్యాసానికి అవసరమయ్యే రుణాలకు ఇక మీదట టీడీపీ జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఏర్పడే ప్రభుత్వం గ్యారెంటీ కల్పిస్తుందని దీనికి సంబంధించిన కలలకు రెక్కలు పథకాన్ని మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ జనసేన పార్టీల అధినేతలు ప్రకటించారని టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో కలలకు రెక్కలు పథకానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మా ట్లాడుతూ కలలకు రెక్కలు పథకం ద్వారా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు ఉన్నత చదువుల కోసం ఎంచుకునే వృత్తి విద్యకు అవసరమైన రుణానికి బ్యాంకులకు టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం గ్యారెంటీ కల్పిస్తుందని, వారి తరపున వడ్డీ కూడా చెల్లిస్తుందని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి మహిళా నేతలు జుత్తుగ సూర్యకుమారి, సుభాషిణి, గౌతమి, మల్లేశ్వరి, చిన్నమ్మ, నాగమణి, వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో కలలకు రెక్కలు పథకం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నల్లమిల్లి, తెలుగు మహిళలు

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రానుంది

కడియం, మార్చి 8: కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం రానుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. కడియంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఏ.అరుణకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రానుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తాడాల కొండ్రాజు, రాజమహేంద్రవరం పట్టణ అధ్యక్షులు బాలేపల్లి మురళి, మండల అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు ఉలిశెట్టి సత్తిబాబు, జిల్లా సెక్రటరీ బండారు వెంకన్నబాబు, జిల్లా జనరల్ సెక్రటరీ కె సత్యనారాయణరాజు పాల్గొన్నారు.


నేటి నుంచి కాకినాడలో తెలుగు సాహితీ సదస్సు

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 8: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో కాకినాడలో ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజులపాటు అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో శని, ఆదివారాల్లో జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు విచ్చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఫౌండేషన్ చైర్మన్ వంగూరి చిట్టెన్‌రాజు, ఆహ్వాన సంఘ సభ్యుడు మార్ని జానకిరామ్‌చౌదరి తదితరులు పర్యవేక్షించారు.



20న చంద్రబాబు ప్రజాగళం

కొవ్వూరు, అనపర్తి నియోజకవర్గాల్లో బహిరంగ సభలు



రాజమహేంద్రవరం,మార్చి8(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌కు గ్యారంటీ, పిలుస్తోంది రా కదలిరా.. ఉమ్మడి సభలతో పార్టీ శ్రేణులు, ప్రజల్లో ఓ ఉత్సాహాన్ని , వచ్చే ఎన్నికల్లో గెలుపు ధీమాను కలిగించిన టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ప్రజల్లో ప్రజాగళం పేరిట ఈ నెల 11 నుంచి పర్యటిం చనున్నారు.ఇప్పటికే 94 మంది తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించిన చంద్రబాబు, త్వరలో రెండో జాబితా, లేదా తుది జాబితా ప్రకటించడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో బీజేపీ పెద్దలతో చంద్రబాబు,పవన్ భేటీ అయ్యారు. పొత్తు కొలిక్కిరావడం, సీట్ల కేటాయింపుపై స్పష్టత రావడం తెలిసిందే. రేపోమాపో వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.ఈ పర్యటన ముగిసిన వెంటనే ప్రజాగళం పేరిట ప్రజ ల్లోకి రానున్నారు.ఈ నెల 11న ఒంగోలు పార్లమెంట్ పరిధి ఎర్రగొండపా లెంలో బహిరంగ సభలో పాల్గొని అక్కడ నుంచి వరుసగా పర్యటిస్తారు. ఈనెల 17న ఏలూరు జిల్లాలోని దెందులూరు సభలో పాల్గొని, అదేరోజు సాయంత్రం కైకలూరు సభలో పాల్గొన్నారు.18న తుణుకులోనూ, ఉండి లోనూ బహిరంగ సభలు ఉంటాయి. 19న అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధి పి.గన్నవరం, రామచంద్రపురంలోనూ సభలు ఉంటాయి. 20న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు,అనపర్తిలో బహిరంగ సభల్లో పాల్గొంటారు.21న కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడులోనూ పెద్దాపురం బహిరంగ సభల్లో పాల్గొంటారు.22 నుంచి అనకాపల్లిలో ప్రవేశించి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సభలు నిర్వహిస్తారు. 25వ తేదీ వరకూ ప్రజాగళం సభల్లో పాల్గొంటారు.

రాజమహేంద్రవరం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి పురందేశ్వరి?

టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తు నేపథ్యంలో ప్రచారం



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తు ఖరారవుతుందని..దీనిలో భాగంగా బిజెపి రాజమహేంద్రవరం లోక్‌సభను కూడా కోరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే ఖాయమైతే ఈ లోక్‌సభ స్థానం నుంచి ఎన్‌టీఆర్ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసే అవ కాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బీజేపీ వర్గాల్లో ఆనందం పెరిగింది. గతంలో ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థి గెలిచిన సందర్భాలు ఉన్నా యి. జిల్లాలో కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల విషయంలో కొంత వరకూ స్పష్టత ఉన్న సంగతి తెలిసిందే. కానీ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి విషయంలో ఇంతవరకూ స్పష్టత లేదు. గత ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసి ఓడిపోయిన మాగంటి రూప తర్వాత నియోజకర్గంలో తిరగలేదు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షనేత లేనట్టుగా ఉంది. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి కెఎస్ జవహర్ వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉంటే రాజమహేంద్రవరం నుంచి బీజేపీ పోటీ చేస్తుందని చాలా రోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. రెండురోజులుగా చంద్రబాబు, పవన్ ఢిల్లీలోని బీజేపీ పెద్దలు అమిత్‌షా, నడ్డాలతో చర్చించిన సంగతి తెలిసిందే. పొత్తు ఖరారైనట్టు, సీట్ల విషయంలో కూడా ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. బిజెపి అడిగే పార్లమెంట్ సీట్లలో రాజమహేంద్రవరం కూడా ఉండడం గమనార్హం. టీడీపీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్ సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగుసార్లు, వైసీపీ ఒకసారి గెలిసింది. ఇక్కడ ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీ అభ్యర్థి పోటీ చేస్తే గెలుపు అనుకూలంగానే ఉంటుందనే అభిప్రాయం ఉంది. ఇప్పటికే వైసీపీ అభ్యర్థిగా డా. గూడూరి శ్రీనివాస్ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ టీడీపీ నుంచి బొడ్డు వెంకటరమణచౌదరితో పాటు పలువురు టికెట్ ఆశించిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం బీజేపీకి కేటాయిస్తున్నట్టు ప్రచారం జరగడంతో పురందేశ్వరినే ఇక్కడ అభ్యర్థిగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది.

జెండాలు పీకితే ఊరుకోం

- వంగలపూడిలో జెండాలు పీకబోయిన అధికారులు
- ఎస్‌ఐతో జనసేన టీడీపీ నాయకుల వాగ్వాదం

సీతానగరం,మార్చి 8 : ఎమ్మెల్యే చెబితే ఫ్లెక్సీలు పీకేస్తారా అంటూ టీడీపీ జనసేన నాయకులు ఆందోళనకు దిగారు.సీతానగరం మండలం వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద శివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టిసం వీరేశ్వరస్వామి ఆల యానికి వెళ్లే మార్గంలో వంగలపూడి ఏటిగట్టు నుంచి పట్టిసం ఆలయం వరకు భారీగా జనసేన, టీడీపీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పార్టీ జెండాలు కట్టారు. అయితే అక్కడ వైసీపీ జెండాలు పెద్దగా కనిపించడం లేదు. ఏర్పాట్ల పరిశీలనకు రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వచ్చి వెళ్లారు. ఆ తరువాత వంగలపూడి పంచాయతీ కార్యదర్శి, సీతానగరం ఎస్‌ఐ జనసేన, టీడీపీ జెండాలను తొలగించడం ఆరంభించారు. రెండు జెండాలు తీసేసరికి జనసేన, టీడీపీ కార్యకర్తలు,నాయకులు అడ్డగించారు. నాయకులు గద్దే సురేష్, ఫణి, కాండ్రు పోసిరత్నం ,వలవల రాజా అక్కడకు చేరుకుని జెండాలు పీకితే ఊరుకోమని హెచ్చరించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.ఎమ్మెల్యే చెబితే జనసేన, టీడీపీ జెండాలు పీకేస్తారా అంటూ సీతానగరం ఎస్‌ఐని ప్రశ్నించారు. ఎస్‌ఐ మాట్లా డుతూ జెండాలు మాత్రమే తొలగిస్తున్నామని, ఫ్లెక్సీలు తొలగించడం లేదని చెప్పగా ఒక్క జెండా కూడా పీకడానికి వీల్లేదని జనసేన టీడీపీ నేతలు గట్టిగా చెప్పారు. దీంతో జెండాలు పీకే కార్యక్రమాన్ని విరమించారు.

గ్యాస్ ధర రూ.100 తగ్గింపు



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 8 : సాధారణ గృహ వినియోగదారులు వినియోగించే వంట గ్యాస్ ధరను రూ.100లు తగ్గిస్తూ మహిళా దినోత్సవం సంద ర్భంగా ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం డొమెస్టిక్ వంట గ్యాస్ ధర రూ.933లుగా ఉంది. రూ.100లు తగ్గించడంతో ఈ ధర రూ.833లకు చేరుతుంది. అయితే ఇది శనివారం నుంచి అమల్లోకి రానుంది. దీంతో ఇప్పటికే గ్యాస్ బుక్ చేసుకున్నవారికి ఈ ధరలు వర్తించే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్యాస్ సబ్సిడీ నామమాత్రంగానే ఉంది. రూ.3 నుంచి రూ.5లలోనే గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నారు. ఆ సబ్సిడీ కూడా పెంచాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ కేంద్రం ఇప్పుడు రూ.100లు తగ్గిస్తూ ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిడదవోలు నుంచి పోటీకి రెడీ..



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8 :జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీకి నేను రెడీ అంటున్నారు. దీనిలో భాగంగా నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కందుల లక్ష్మి దుర్గేష్ ఎన్నికల ప్రచార వాహనాన్ని శుక్రవారం రాజమహేంద్రవరంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అభ్యర్థి దుర్గేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు రిబ్బన్ కట్ చేసి ఎన్నికల ప్రచార వాహనం ప్రారంభించారు.

హర హర మహాదేవ

- శివనామస్మరణతో మార్మోగిన గోదారి
- రాజమహేంద్రవరానికే లక్ష మంది భక్తులు రాక
- కిక్కిరిసిన గోదావరి ఘాట్‌లు.. ఆలయాలు
- దారి పొడవునా దాతల విందు.. పసందు





రాజమహేంద్రవరంలో కిక్కిరిసిన పుష్కరఘాట్

శివయ్యా..కాపాడయ్యా : కొవ్వూరులో భక్తాభిషేకం

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, మార్చి 8 : గోదారంతా జనం..జనం.. అడుగుతీసి అడుగేయలేనంతా భక్తజనంతో గోదారంతా కిక్కిరిసింది.. హరహర మహాదేవ శంభో శంకర..హరోం హర.. ఓం నమఃశివాయ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. మహా శివరాత్రి పర్వదినం శుక్రవారం రాజమహేంద్రవరం, కొవ్వూరుకు భక్తజనంతో పోటెత్తారు. ఎక్కడెక్కడి నుంచో తరలి వచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. రాజమహేంద్రవరలో దక్షిణాకాశిగా ప్రసిద్ధిగాంచిన కోటిలింగాల క్షేత్రం, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్‌కు, గౌతమిఘాట్, సరస్వతి ఘాట్, కొవ్వూరులోని గోష్పాదక్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు చేరుకున్నారు.పవిత్రగోదావరిలో పుణ్య స్నానాలు చేశారు. కోటిలింగాల క్షేత్రంలోని ఉమాకోటిలింగేశ్వ రాలయం, పుష్కరాలరేవులో వీరభద్రస్వామి, గోదావరి బండ్ రోడ్డులో మార్కండేయేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, సర్వేశ్వరాలయం, అన్నపూర్ణసమేత విశ్వేశ్వరాలయం (జోడిగుళ్ళు), ఉజ్జయిని మహంకాళేశ్వరాలయం , క్వారీప్రాంతంలోని కల్యాణి సమేత సోమలింగేశ్వరాలయం, సారంగధరేశ్వరాలయం, జాంపేట ఉమారామలింగేశ్వర ఆలయాలు భక్తజనంతో కిక్కిరిశాయి. కొవ్వూరు గోష్పద క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేకువజాము నుంచి క్షేత్రానికి చేరుకుని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు చేశారు. క్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలపై శివలింగాలకు గోదావరి జలాలతో అభిషేకాలు చేశారు.తెల్లవారుజామున 2 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు భక్తజనంతో గోదావరి తీర ప్రాంతమంతా కిక్కిరిసింది. సుమారు లక్ష మందికి పైగానే భక్తులు గోదావరి స్నానాలు చేసినట్టు అంచనా వేస్తున్నారు. వేలాది వాహనాలు రావడంతో గోదావరి రేవులకు అనుసంధానంగా ఉన్న రహదారులు అన్ని రద్దీగా మారిపోయాయి. కంబాలచెరువు-సీతంపేట- పేపరుమిల్లు రోడ్డు, కంబాలచెరువు-దేవిచౌక్- గోకవరంబస్టాండ్ రోడ్డు, కంబాలచెరువు- కృష్ణానగర్-ఆర్యాపురం రోడ్డు , కోటిపల్లిబస్టాండ్ గోదావరి బండ్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చాలా రద్దీగా మారి వాహనాలు జామ్ అయ్యాయి. మధ్యాహ్నం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.



ఎస్పీ జగదీశ్ పరిశీలన

ఔరా అనిపించిన దాతృత్వం

శివరాత్రి సందర్భంగా రాజమహేంద్రవరంలో వందలాదిగా దాతలు ముందు కొచ్చారు. దారిపొడవునా భక్తులకు పంచుతూనే ఉన్నారు. ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజనం, మజ్జిగ, ఐస్‌క్రీమ్,పుచ్చకాయ ముక్కలు, బాదం పాలు, రోజ్‌మిల్క్, పులిహోర తదితర రకాల ప్రసా దాలు ఇలా ఒక్కటేమిటి ఎన్నో రకాలు భక్తులు పంచారు. ఎవరికి తోచిన రీతిన వారు భక్తులకు తమ వంతు దానం చేశారు. రాజమహేంద్రవరం వాసుల దాతృత్వంపై ఎక్కడె క్కడి నుంచో తరలివచ్చిన భక్తజనం ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఎస్పీ భద్రత ఏర్పాట్లు పరిశీలన

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ ప్రదేశాల్లోని భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ పరిశీలించారు. తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ బందోబస్తుపై సూచ నలు చేశారు. ఆలయాల వద్ద క్యూలైన్లు పార్కింగ్ ప్రదేశాలను గమనించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అవాంఛనీయ ఘట నలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలుతగా స్నానాల ఘాట్లకు చేరుకున్న ఎస్పీ స్నానాలకు వెళుతున్న భక్తులను గమనిస్తూ లోతుకు వెళుతున్న వారిని హెచ్చరించాలన్నారు. భక్తుల భద్రతలో ఎలాంటి ఇబ్బందీ రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని డీఎస్పీలను ఆదేశించారు.

గోదావరి స్నానానికి వచ్చి
మహిళ అదృశ్యం



కొవ్వూరు, మార్చి 8 : శివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో గోదావరి పుణ్యస్నానానికి వచ్చిన మహిళ అదృశ్యమైంది. బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన మేడపాటి వెంకటలక్ష్మి(45) శుక్రవారం శివరాత్రి సానానికి కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చింది. తనతో తెచ్చుకున్న బ్యాగు, సెల్‌ఫోన్ గట్టుపై వదిలిపెట్టి నదిలో దిగి అదృశ్యమైంది. స్థానికులు వెంకటలక్ష్మి బ్యాగులో ఫోన్ తీసి కుటుంబీకులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న వెంకటలక్ష్మి కుటుంబీకులు గోష్పాదక్షేత్రానికి చేరుకుని వెతికినా కనిపించక పోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.వెంకటలక్ష్మికి భర్త శ్రీనివాసరెడ్డి,(ఇద్దరు పిల్లలు) కుమారుడు, కుమార్తె ఉన్నారు.



గోదారంతా జనం : కొవ్వూరులో కిక్కిరిసిన గోష్పాదక్షేత్రం



దీపాలు వదులుతున్న దంపతులు

అడకత్తెరలో వైసీపీ

వలంటీర్‌కు అందలం.. కేడర్ నిరుత్సాహం

- వలంటీర్లకు తాయిలాలు..కేడర్‌లో గుస్సా
- కనీస విలువలేదని కార్యకర్తల ఆందోళన
- పార్టీకి దూరమవుతున్న కేడర్
- జీతాలు పెంచకుండా... గిఫ్టులు, సన్మాలేనా..
- వలంటీర్లలో గూడుకట్టుకున్న ఆవేదన
- జిల్లాలో 9,300 మంది వలంటీర్లు
- వలంటీర్ల ఖాళీలు 150

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. సిమ్‌లేని సెల్‌ఫోన్‌లా క్యాడర్ పరిస్థితి ఉంటే..బ్యాలెన్స్ సెల్‌ఫోన్‌లా వలంటీర్ల పరిస్థితి ఉంది. అయినా వైసీపీ అధిష్ఠానానికి వీళ్ల గురించి ఆలోచించే యోచనే లేదు. వీళ్లను వాడుకోవడమే వైసీపీ లక్ష్యం. అరకొర జీతాలతో ఇబ్బంది పడుతూ వివిధ వర్గాలకు పింఛన్లు అందిస్తూ, కొందరి మెప్పు, కొందరి శాపనార్థాలు భరిస్తూ వలంటీర్లు బతుకీడుస్తున్నారు. వలంటీర్లు ఇటీవల జీతాలు పెంచమని కోరితే అనేక మందిని ఉద్యోగాల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కొందరికి నయానో భయానో నచ్చచెప్పి ఈ ఎన్నికల్లో వారిని ఉపయోగించుకోవాలని వైసీపీ ప్లాన్ చేసింది. అందుకే వారికి జీతాలు పెంచకుండా, అవార్డులు, సన్మానాలు చేయడంతో పాటు, ఇటీవల గిఫ్టులు ఇస్తున్నారు.వలంటీర్లను కేవలం ఈ గిఫ్టులతో వలలో పడేసుకోవాలనేది వైసీపీ ఎత్తుగడ. వాస్తవానికి వలంటీర్లంతా వైసీపీకి చెందిన వారు కాదు. ఇటీవల వాళ్ళలోని అనేక మంది ఆలోచన మారింది. అందులో వైసీపీతో పాటు, టీడీపీ, జనసేన పార్టీల అభిమానులు ఉన్నారు. వాళ్లను ఉద్యోగులుగా గుర్తిసే ఆనందించేవారు. కేవలం సన్మానాలు, అవార్డులు, గిఫ్టులతో పూర్తిగా వాడేసుకోవాలనుకుంటే పడేటట్టు లేరు. వలంటీర్ల పరిస్థితి ఇలా ఉంటే.. వలంటీర్లకు సన్మానాలు, అవార్డులు, గిఫ్టులు ఇవ్వడం వల్ల వైసీపీ అభిమానులు, కార్యకర్తల్లో ఆక్రోశం పెరుగుతోంది. గత ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి కార్యకర్తలు సర్వం త్యాగం చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరినీ కరివేపాలా తీసి పక్కన పెట్టేశారు. కనీసం ప్రతిఫలం దక్కలేదు. కనీస గౌరవం వారికి దక్కలేదు. కార్యకర్తల వల్ల ఏ పనీ కాకపోవడంతో కార్యకర్తలను ప్రజలు పట్టించుకునే పరిస్థితే లేదు. ఈ నేపథ్యంలో వైసీపీ కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఐదేళ్ల పాటు కనీసం తమను పట్టించుకోకుండా ఎన్నికల వేళ పిలుస్తుండడంతో పాటు వైసీపీని గెలిపించే బాధ్యత కార్యకర్తలదే అన్నట్టు నేతలు మాట్లాడుతుండడంతో మరింత ఆగ్రహానికి గురవుతున్నారు. కనీసం ఎన్నికల వేళ కూడా వలంటీర్లకు ఇచ్చే గిఫ్టులు తమకు ఇవ్వడం లేదని, తామెందుకు వీళ్ల వెంట ఉండాలనే వాదన కూడా కొంత మంది చేస్తున్నారు. ఈసారి ఎన్నికలు వాళ్లే నిర్వహించుకుంటారులే అనే నిర్ణయానికి కూడా కొంతమంది వచ్చారు.గతంలో బిర్యాని పొట్లం, మందు, బండికి పెట్రోలు పోయిస్తే ఊగిపోతూ వచ్చేసేవారు. ఇవాళ ఆ పరిస్థితి లేదు. వైసీపీకి త్యాగాలు చేయడం వల్ల ఫలితం శూన్యమనే నిర్ణయానికి కేడర్‌లో చాలా మంది వచ్చేశారు. ఎవరో నాయకుడిని నమ్ముకుని పనిచేసినా, గెలిచిన తర్వాత తనకు కావాల్సిన వాళ్లను పట్టించుకోవడం, పార్టీ కార్యకర్తల పట్ల శీతకన్ను వేయడం,నామినేటెడ్ పదవులు తమకు కావలసిన వారికే ఇచ్చుకోవడం, ఇతర పార్టీ వాళ్లను తీసుకుని వాళ్లకు పదవులు ఇవ్వ డం వంటి సంఘటనలతో అసలు సిసలైన కార్యకర్తలు నిర్వీర్యమైపోతున్నారు. ఇక్కడ వలంటీర్లు సంతృప్తిగా లేరు. క్యాడర్ సంతృప్తిగా లేదు. ఇక వైసీపీ కొందరి చేత ఇంటింటా సర్వే చేయిస్తోంది. వలంటీర్లను పంపించి, మామూలుగా మాట్లాడించి, ఎవరు, ఏకుటుంబం ఏపార్టీకి ఓటేస్తుందో తెలుసుకోవాలని పురమాయించినట్టు సమాచారం. ఇక్కడ కూడా కార్యకర్తలను వైసీపీ నమ్మడం లేదు.దీంతో క్యాడర్‌లో మరింత నిరుత్సాహం పెరుగుతోంది. పైగా ఇటీవల టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా వలంటీర్లను ప్రోత్సహించి.. వాళ్ల భవిష్యత్ బాగుండేలా చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో వైసీపీ క్యాడర్ మాత్రం వలంటీర్లకు లభించిన గుర్తింపు కూడా తమకు లభించలేదనే ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ 9,300 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో ఇటీవల జీతాలు పెంచమని కోరినందుకు చాలా మందిని ఉద్యోగాల నుంచి తీసేశారు. చాలా మందికి నోటీసులు ఇచ్చి బెదిరించారు. కొందరు వ్యక్తిగత కారణాల వల్ల మానేశారు. ఇలా ఖాళీలు 150 ఉన్నాయి. ప్రస్తుతం పనిచేసేవారిలో కూడా తమకు జీతాలు ఇక పెంచుతారనే నమ్మకం లేకుండా పోయింది. ఎన్నికల 2 నెలలు వీళ్లకు జీతాలు ఇచ్చే అవకాశం లేదు. కొందరు వైసీపీ నేతలు ఈ విషయాన్ని కూడా స్పష్టం చేసి.. మీకెవరు డబ్బులిస్తారు. ఇస్తే మేమే ఇవ్వాలి..కాబట్టి చెప్పినట్టు పనిచేయాలని ఆదేశిస్తున్నారు. ఈ పరిస్థితి వాళ్లకు ఇబ్బందిగా మారింది.ఈ నేపథ్యంలో వైసీపీ పరిస్థితిలో అడకత్తెరలో పడినట్టు అయింది.

రాజానగరంలో ఇప్పుడే ఉగాది కానుక..!

రాజానగరం, మార్చి 8 : వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రాజానగరంతో పాటుగా పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ నూతన దుస్తులు పంపిణీ చేశారు. తొలుత వలంటీర్లను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించిన అనంతరం కొత్త చీరలు, కొత్త బట్టలను రహస్యంగా పంపిణీ చేసినట్టు సమాచారం.ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్లకు కొత్త బట్టలు అందజేయడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూత న వస్త్రాల పంపిణీ తతంగమంతా ఎమ్మెల్యే సతీమణి చేతుల మీదుగానే సాగుతున్నట్టు తెలిసింది.ప్రతి ఏడాది ఉగాది పండగకు నూతన వస్త్రాలు అంద జేయడం జరుగుతోందని..ఈ ఏడాది ముందుగానే వలంటీర్లకు అందజేయడం జరిగిందని అధికార పార్టీ నాయకులు,వలంటీర్లు చెప్పడం గమనార్హం.



ఘనంగా..మన పండుగ..

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 8 : ఎప్పుడూ బిజీబిజీగా గడిపే జిల్లా అధికారిణులు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విధులకు కాస్త బ్రేక్ ఇచ్చి ఆనందంగా గడిపారు.. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఒకరికొకరు తినిపించుకుని పండుగ చేసుకున్నారు. మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతల నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడం చిన్న చిరు నవ్వుతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ మాధవీలత అన్నారు. మన కోసం రోజులో కొంత సమయం కేటాయించుకోవడం, వ్యాయామం చేయడం, మనసుకి ఇష్టమైన వ్యాపకం చేసుకోవడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులతో పాటు జిల్లా అధికారులు జి.నరసింహులు, ఆర్.కృష్ణనాయక్,బీవీఎస్.రాఘవరావు, కలెక్టర్ సీసీ వెంకటేష్, డీటీలు ఎం.సునీల్, సురేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మంత్రిగారు వస్తారా..?చూపిస్తా!

ధవళేశ్వరం, మార్చి 8 : మంత్రి గారూ స్వచ్ఛత అంటూ ఫొటోలకు ఫోజులెందుకండి దండగ.. మీరు వస్తానంటే చోటు నే చెబుతా రండి అంటూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గోరంట్ల ధవళేశ్వరంలో పేరుకుపోయిన చెత్తన చూపించి పైవిధంగా స్పందించారు.స్వచ్ఛత మన అందరి బాధ్యత అంటూ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేసే బాధ్యత తనది అన్నట్టు గ్రామాల్లో హడావుడి చేస్తున్న మంత్రిగారికి రహదారులపై పలు చోట్ల పేరుకుపోయిన చెత్త కనిపించడం లేదా అంటూ ఎద్దేవా చేశారు. హడావుడి వద్దు పనిచేయండన్నారు.

మహిళలకు ఎంపీ చీరల తాయిలం

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు తాయిలాల పంపిణీలో బిజీగా గడుపుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత చిక్కులు వస్తాయని ముందుగానే 'సర్దేస్తున్నారు'. ఎంపీ భరత్ రామ్ బుధవారం(6న) మధ్యాహ్నం డ్వాక్రా మహి ళలు, వార్డుల ఇన్‌చార్జులతో ఆనం కళా కేంద్రంలో సభ ఏర్పాటు చేశారు. యథావిధిగా ఊకదంపుడు ప్రసంగాన్ని ఏకరువు పెట్టారు. అక్కలు, చెల్లెమ్మలు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. తర్వాత అసలు కార్యక్రమం మొదలైంది. మహిళలకు దర్జాగా బహిరంగంగా భారీగా చీరలు అందజేయడం గమనార్హం. అంతకుముందు విలేకరులకు బహుమతులు ఇచ్చిన విషయం విధితమే.



దర్జాగా.. బహిరంగంగా : ఆనం కళాకేంద్రంలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

ఉచిత న్యాయ సేవలు పొందడానికి..
మహిళలందరూ అర్హులే

● పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయసేవలు పొందడానికి మహిళలందరూ అర్హులేనని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళా ప్రత్యేక కారాగారంలో నిర్వహించిన వేడుకలకు హాజరై మహిళా ఖైదీలు, జైలు సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కారాగారంలో ఉన్న మహిళలు ఏ విషయాల గురించీ ఆందోళన చెందవద్దన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాన్ని అవసరమైన మహిళలు వినియోగిం చుకోవాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మహిళలు, పిల్లలు, బడుగు బలహీన వర్గాలకు డీఎల్ఎస్ఏ అందిస్తున్న సేవల గురించి వివరించారు. వేడుకల్లో భాగంగా మహిళలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో డీఐజీ ఎంఆర్ రవికిరణ్, ఓఎన్‌జీసీ సీజీఎం మనీష శర్మ, జీఎం సంగీత సాహు, కారాగార సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

● వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



నిడదవోలులో వాసవీ వనితాక్లబ్ ఆధ్వర్యంలో మహిళా పోలీసు, మహిళా న్యాయవాదిని సత్కరిస్తున్న దృశ్యం

నిడదవోలు, మార్చి 8: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారని వాసవీ వనితాక్లబ్ అధ్యక్షురాలు సింహాద్రి శిరీష అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలో మదనగోపాలస్వామి ఆలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్‌ను, మహిళా న్యాయవాదిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసవి వనితాక్లబ్ అధ్యక్షురాలు సింహాద్రి శిరీష మాట్లాడుతూ మహిళలు ఒక పక్క కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే ఉద్యోగినిలుగా రాణిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి గాయత్రి, జవ్వాది శిరీష, వాసవి వనితాక్లబ్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు మరింత అభివృద్ధి చెందాలి



యర్నగూడెంలో మహిళలను సన్మానిస్తున్న పార్డ్ ఇండియా సభ్యులు

దేవరపల్లి, మార్చి 8: దేవరపల్లి మండలం యర్నగూ డెంలో పార్డ్‌ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వివిధ హోదాల్లో ఉన్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో ఉందని మహిళలు మరింత అభివృద్ధి సాధించాలన్నారు. మహిళా సాధికారిత ద్వారా అన్నిరంగాల్లోనూ ప్రభుత్వాలు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నా యన్నారు. సన్మాన గ్రహీతలు యాదవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి హరిచందన, కృష్ణపాలెం బీఆర్.అంబేద్కర్ వృద్ధాశ్రమ పర్యవేక్షకురాలు శ్యామలాదేవి, బాలికల వసతి గృహ అధికారిని ధనలక్ష్మి, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ధూళిపూడి రవీంద్ర, అచ్యుతరావు, సోమిశెట్టి వెంకట్రాజు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు
టీడీపీ జనసేన కలలకు రెక్కలు పథకం




సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మహిళా నాయకులు

కొవ్వూరు, మార్చి 8 : కలలకు రెక్కలు పథకంతో మహిళా సాధికారత దిశగా టీడీపీ, జనసేన పార్టీలు మరో కీలక ముందడుగు వేశారని కొవ్వూరు పట్టణ టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఇమ్మని శిరీష అన్నారు. శుక్రవారం అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కొవ్వూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ చదువుకు సంబంధించిన డబ్బులు కొరతతో ఇంటికి పరిమితం కాకూడదని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు కలలకు రెక్కలు పథ కాన్ని మహిళల కోసం తీసుకువచ్చారన్నారు. కౌన్సిలర్ పాలూరి నీలిమ మాట్లాడుతూ మహిళలకు వృత్తి పరమైన విద్యకు మార్గాలను అందించడంతోపాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఖండబట్టు విజయలక్ష్మి మా ట్లాడుతూ ఈ పథకంలో బ్యాంకు లోన్ తీసుకునే మహిళలకు టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రుణ హామీదారుడిగా నిలిచి, రుణానికి సంబంధించిన వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. సమావేశంలో 19వ వార్డు కౌన్సిలర్ కిలారి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీలో రూ.12 లక్షలు చోరీ

● దొంగల ఆచూకీ చెబితే రూ.20 వేలు నజరానా : ఎస్పీ

చోరీకి పాల్పడిన దుండగుల ఫొటోలు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నీసుపేట పాత స్టేట్ బ్యాంకు మొదటి అంతస్తులో ఒక ఫైనాన్సు కంపెనీ కార్యాలయం ఉంది. ఆగంతకులు అందరూ శివరాత్రి హడావుడిలో ఉండగా శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇనుపరాడ్డుతో షట్టరును బలవంతంగా మనిషి దూరే ఎత్తుకు పైకిలేపి లోనికి ప్రవేశించారు. లోపల టేబుల్ సొరుగు తాళాన్ని స్క్రూడ్రైవర్లతో తొలగించి సుమారు రూ.12లక్షల నగదును అపహరిం చారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వాళ్ల ఫొటోలను ఎస్పీ జగదీశ్ మీడియాకు విడుదల చేశారు. దొంగల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 వేల బహుమతి అందజేస్తామని ప్రకటించారు. టూటౌన్ సీఐ ఫోన్ 9440796576 లేదా సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఫోన్ 94907 60791కి సమాచారం అందించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంతా ఉంచుతామన్నారు.

గోరంట్ల చేతుల మీదుగా హుండీ అందజేత

దవళేశ్వరం, మార్చి8: స్థానిక కంచర్‌లైన్ వద్ద ఉన్న శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయానికి టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి సమకూర్చిన హుండీని శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎర్రకొండపై శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, సీనియర్ నాయకులు మార్నివాసుదేవరావు, పండూరి అప్పారావు, పిన్నంటి ఏకబాబు, నీలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, సుందరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు



దేవరపల్లి శివాలయంవద్ద బారులు తీరిన భక్తులు

శంభో శివ శంభో..

● గోష్పాదక్షేత్రానికి పోటెత్తిన భక్తులు
● శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
● కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు



నిడదవోలులో గోలింగేశ్వరస్వామికి విశేష అభిషేకాలు

కొవ్వూరు, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొవ్వూరు గోష్పాదక్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దాతలు పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు. అవంతి ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ఆదేశాలతో క్షేత్రానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక శానిటేషన్ చేపట్టారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, మత్స్యశాఖ, ఫైర్ అధికారులు భక్తులు నదిలో లోపలికి ఎవరూ వెళ్లకుండా మరబోట్లు ఏర్పాటుచేసి గజ ఈతగాళ్లను నియమించారు. కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల, సుబ్రమణ్య స్నానఘట్టంలోని కాశీ విశ్వేశ్వరస్వామి, పాతవూరు ఉమాచోడేశ్వర స్వామి ఆలయాలతోపాటు మండలంలోని కుమారదేవం, చిడిపి, తోగుమ్మి, దొమ్మేరు, పంగిడి, పెనకనమెట్ట, వేములూరు, వాడపల్లి, మద్దూరు గ్రామాలలో శివాలయాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దూర ప్రాంతాల నుంచి గోదావరి పుణ్యస్నానాలకు వేలాదిగా కొవ్వూరు వచ్చిన భక్తులకు దాతలు ప్రసాద వితరణ చేశారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని ప్రకృతి రావణాబ్రహ్మ బ్రహ్మసూత్ర శివాలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఎదురుగా సిద్ధ గణపతి ఆధ్వర్యంలో భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు.

వాడపల్లిలో రథోత్సవం.. మద్దూరు ప్రభ

కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలో శ్రీ ఉమా అనంత బోగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. వాడపల్లి గ్రామంలో ఉన్న శ్రీ ఉమా అనంత బోగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు పర్యవేక్షణలో ఆలయ కమిటీ సహకారంతో ఉత్సవమూర్తుల రథోత్సవాన్ని గ్రామ పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. మద్దూరు గ్రామంలో ప్రభల ఉత్సవం ఊరేగింపు నిర్వహించారు. మద్దూరు గ్రామంలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులతోపాటు ప్రభల ఉత్సవా న్ని గ్రామ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా స్వామి తెప్పోత్సవం

కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో ఆలయ అర్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో తెప్పోత్సవం నిర్వహించారు. సాయంత్రం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో మధ్యలో శివలింగం ఏర్పాటుచేసి భక్తులు చుట్టూ నిలబడిహారతులు పట్టారు. లింగోద్భవ సమయంలో జ్యోతిర్లింగార్చన, రుద్ర హోమం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే తలారి, చైర్‌పర్సన్ రత్నకుమారి పూజలు

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని మహాశివున్ని ప్రార్థించినట్లు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొవ్వూరు గోష్పాదక్షేత్రం, రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని ప్రకృతి రావణాబ్రహ్మ బ్రహ్మసూత్ర శివాలయాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారిలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోష్పాదక్షేత్రంలో అవంతి ఫౌండేషన్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన చిన్నారులకు పాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కంటమణి రమేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.



పెరవలి: తీపర్రులో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



కొవ్వూరు మండలం మద్దూరు ప్రభను తీసుకెళుతున్న భక్తజనం

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు గోలింగేశ్వరస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గోలింగేశ్వరస్వామి రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దర్శనాలకు భక్తులు క్యూకట్టారు. నిత్యాభిషేకాలు, విశేష అభిషేకాలు అందుకున్న గోలింగేశ్వరస్వామిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయాల్లో పోటెత్తిన భక్తులు

తాళ్లపూడి: తాళ్లపూడి మండలంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధికసంఖ్యలో దర్శనాలకు బారులుతీరారు. తాళ్లపూడి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో, ప్రక్కిలంక అన్నపూర్ణా సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో, వేగేశ్వరపురం చాయా సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహి ంచారు. ఆలయాల వద్ద తాళ్లపూడి నుంచి పట్టిసీమ వెళ్లే దారిలో భక్తులకు దాతలు మజ్జిగ, మంచినీరు, అన్నదానం ఏర్పాటుచేశారు. ప్రక్కిలంక ఏటిగట్టుమీద ఉన్న భక్తాంజనే యస్వామి వారి ఆలయంవద్ద సొలస కస్తూరి శ్రీరామ చంద్రమూర్తి, పువ్వాడ కుమారీల జ్ఞాపకార్థం ఉదయం అల్పాహారం మధ్యాహ్నం అన్నసమారాధన చేసినట్లు ని ర్వాహకులు సొలస విశ్వనాథం, శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ సత్యానందంలు తెలిపారు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామా ల్లోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాలంగి గ్రామంలోని రామలింగేశ్వరస్వామివారిని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు దంపతులు, వారి కుమారుడ్డు వరుణ్‌సాయి దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలు తెల్లవారుజాము నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్, దేవస్థాన చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, నాయకులు పాలాటి శరత్‌బాబు, బొక్కా శివకుమార్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

శివాలయాల్లో శివనామస్మరణలు..

పెరవలి: శివరాత్రి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లోని శివాలయాలయాల్లో శివనామస్మరణంతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్యంగా తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, గోదావరి ప్రాంతంలో భక్తులు గోదావరి స్నానమాచరించారు. తీపర్రులో ఉదయం వీరభద్రుడు ఊరేగింపు, మధ్యాహ్నం రథోత్సవం, సాయంత్ర ప్రభల సంబరం ఆకట్టుకున్నాయి. టీడీపీ నాయకుడు కుందుల వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో తీపర్రులో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 10వేల మందికిపైగా ఇక్కడ అన్నప్రసాదం స్వీకరించారు. చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు.

చాగల్లు: మండలంలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక శ్రీపార్వతి సమేత శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారు అమ్మవార్లకు అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. నందిగంపాడులోని శివాలయంలోను స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఊనగట్ల శివాలయంలో స్వామివారికి అభిషేకమలు, పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వరస్వామి వారి ఉత్సవాలు సందర్భంగా స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు, యువకులు శరీరంపై శూలాలు గుచ్చుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కలవలపల్లిలోను, చిక్కా ల, ధరవరం, చంద్రవరం గ్రామాల్లోను శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు కొవ్వూరు తరలివెళ్లి గోదావరి స్నానాలు ఆచరించి గోష్పాద క్షేత్రంలోని స్వామి వారిని దర్శించుని మొక్కులు తీర్చుకున్నారు.

గోపాలపురం: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు వేదమంత్రాల నడుమా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని చెరుకుమిల్లి, జగన్నాథపురం, దొండపూడి, సాగిపాడు, తదితర గ్రామాల్లో భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా రాజంపాలెంలో షిరిడిసాయి బాబా మందిరం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంవద్ద 5వేల మందికి భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దొండపూడిలో పట్టిసీమ వెళ్లే భక్తుల దాహార్తీ తీర్చేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు వెంకట్రావు, సురేష్, శ్రీనివాస్, రాజేష్, నున్నా బుల్లియ్య, వెల్లంకి జయ శివసూర్యం, మగ్గి రమాకాంత్, కొమ్మన ప్రసాద్, వెంకటేశ్వ రరావు, మద్దాల నాగేశ్వరరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం దేవరపల్లి, గౌరీపట్నం, చిన్నాయిగూడెం, దుద్దుకూరు, యర్నగూడెం, కృష్ణంపాలెం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవరపల్లి శివాలయంలో తెల్లవారుజాము నుంచి 11గంటల వరకు భారీ క్యూలైన్లలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



గోపాలపురం: రాజంపాలెంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



పెరవలి: తీపర్రులో కుందుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం



కొవ్వూరు శ్రీనివాస స్నానఘట్టంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

● సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ
● దొమ్మేరులో సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు



నిడదవోలులో కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

కొవ్వూరు, మార్చి 8 : ఎటువంటి ప్రలోభాలకు, భయాందోళనకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కొవ్వూరు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. జిల్లా కలెక్టర్ కె.మాదవీలత ఆదేశాలమేరకు శుక్రవారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో డీఎస్పీ కె. రామారావు ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ సెంట్రల్ ఫోర్స్‌తో కవాతు చేపట్టారు. సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ జెండా ఊపి కవాతును ప్రారంభించారు. శ్రీవాస్తవ మాట్లాడుతూ భయం లేకుండా ప్రతిఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో కవాతు నిర్వహిస్తామన్నారు. 100శాతం పోలింగ్ నమోదుకావాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, దానిని దుర్వినియోగపర్చకుండా, ప్రలోభాలకుగాని, భయాందోళనకుగాని గురికాకుండా అర్హతకలిగిన వ్యక్తులకు ఓటు వేయాలన్నారు. డీఎస్పీ కె.రామారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిర్భ యంగా ఓటు హక్కువేసే విధంగా ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపడానికి ఎస్పీ ఆదేశాలమేరకు (సీఐఎస్ఎఫ్ బలగాలతో) ఆర్మ్‌డ్ సెంట్రల్ ఫోర్స్‌తో దొమ్మేరు గ్రామంలో కవాతు చేపట్టామన్నారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలలోని ప్రతి గ్రామంలో ఆర్మ్‌డ్ ఫోర్సుతో కవాతు నిర్వహించి ఓటర్లకు భరోసా కల్పిస్తామన్నారు. ఎవరైనా ప్రలోభపెట్టినా, భయాందోళనకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎటువంటి



కొవ్వూరు: దొమ్మేరులో కవాతు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, కేంద్ర బలగాలు

అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులకు సహకరించాలన్నారు.పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు,సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్

నిడదవోలు, మార్చి 8: రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. తిమ్మరాజుపాలెం నుంచి ప్రారంభమై గణపతి సెంటర్, చర్చిపేట, రైల్వేస్టేషన్ మీదుగా మెయిన్ రోడ్డు నుంచి గణేష్‌చౌక్ సెంటరు వరకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ మార్చ్‌ఫాస్ట్‌లో పట్టణ ఎస్ఐ అప్పారావు, పట్టణ పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా డాక్టర్ కృష్ణారావు



నిడదవోలు, మార్చి 8: ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ డీవీ కృష్ణారావు రానున్న ఎన్నికలలో రాజమహేంద్రవరం పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నారని శుక్రవారం ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో తెలిపారు. డాక్టర్ డివి కృష్ణారావు నిడదవోలు డాక్టర్ రాజారావు మెమోరియల్ ఆసుపత్రిలోను, హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఐకాన్ హాస్పటల్స్ స్థాపించి వైద్య రంగంలో సేవలు అందిస్తున్నారు.

'ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం'

దేవరపల్లి, మార్చి 8: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం ముందుంటుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలంలో కృష్ణంపాలెం గ్రామానికి చెందిన పెనుగొండ శివకుమార్‌కు లీవర్ మార్పిడి నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా శుక్రవారం మంత్రి తానేటి వనిత రూ.10లక్షల ఎల్ఓసీని శివకుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాయుడు దుర్గా ప్రసాద్, ఎంపీటీసీ జగదీశ్వర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు సత్తి ఈశ్వర్‌రెడ్డి, వైసీపీ కన్వీనర్ కూచి పూడి సతీష్, దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	ఆపరేషన్ వాలంటైన్
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	గామి
అనన్య	భీమా
నిడదవోలు	
వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష	ఆపరేషన్ వాలంటైన్
శ్రీగణపతి	వ్యూహం
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్